## అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్






# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd



## 1962 అంబులెన్స్ సిబ్బందికి జీతాలు విడుదల చేయాలి






Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 291 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 16 అక్టోబర్ 2025




## నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

- రూ.13, 400 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఎక్స్ వేదికగా మోడీ తెలుగులో ట్వీట్

**న్యూఢిల్లీ,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా లో గురువారం పర్యటించనున్నారు. ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా మిగతా2లో...

# జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత

- త్వరలో అక్రిడిటేషన్ పాలసీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పాత్రికేయుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. బుధవారం నాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్‌వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కితీసుకురావాలని ఆదేశించారు.

## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ధి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశపు సెమి-హై-స్పీడ్ రైళ్ల జాబితాలో తర్వాత వర్షన్ రానుంది. వందేభారత్ 4.0 ను అభివృద్ధి చేయనున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం ప్రకటించారు. ఎగుమతి గిరాకీలకు అనుగుణంగా దాని రూపకల్పన ఉంటుందని వెల్లడించారు. రైళ్ల ఆధునిక సాంకేతికత విషయంలో దేశాన్ని గ్లోబల్ సప్లయిర్‌గా మార్చేదిశగా ఇది కీలక అడుగు మిగతా2లో...

## పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా...?

- మాగంటి సునీతను అవమానించేలా మంత్రులు మాట్లాడుతారా
- చిల్లర రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే
- కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్రానికి చేసిందేమీ లేదు
- మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు



**హైదరాబాద్,15 (పిసిడబ్ల్యూ న్యూస్):** భర్తను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానించే విధంగా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడటం దుర్మార్గమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా కాంగ్రెస్ సంస్కృతి అని విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆశీర్వాదంతో మాగంటి గోపీనాథ్ గెలిచారని తెలిపారు. దురదృష్టవశాత్తూ గోపీనాథ్ చనిపోయారని... ఆ కుటుంబాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు. మాగంటి గోపీనాథ్‌కి పెళ్లికాని ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. భర్తను కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు మిగతా2లో...

## జూబ్లీహిల్స్‌లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

- ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు






## మావోయిస్టులకు వరుస దెబ్బలు

- సిఎం ఫడ్నవీస్ ముందు లొంగిపోయిన మల్లోజుల
- అదే బాటలో తక్కళ్లపల్లి వాసుదేవరావు
- నేడు ఛత్తీస్ గడ్ సిఎం ముందు లొంగిపోతారని ప్రచారం
- సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 27 మంది లొంగుబాటు

**నాగపూర్/హైదరాబాద్,15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏరివేత తప్పదు..లొంగిపోతే బతికిపోతారని కేంద్ర హోంమంత్రి హెచ్చరికల నేపథ్యంలో మావోయిస్టులు భారీగా మిగతా2లో...



## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్‌లో నిర్ణయం

- అధికారులతో సమీక్షించిన మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** హ్యామ్ రోడ్లు, టిమ్స్ హాస్పిటల్స్ వంటి పలు ప్రాజెక్టులపై చర్చించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు, గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిన కారణంగా, ప్రభుత్వం హ్యామ్ విధానంలో పెద్ద ఎత్తున రాష్ట్ర రోడ్లు నిర్మించాలనే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.రోడ్లు, భవనాలు శాఖపై సమీక్ష నిర్వహించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేటి కేబినెట్‌లో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఎర్రమంజిల్ ప్రధాన కార్యాలయంలోని సమావేశంలో మంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ల నిర్మాణంపై సీరియస్‌గా ఉన్నారని, రాష్ట్రంలో నాణ్యమైన రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలని దృష్టి సారిస్తున్నట్లు మంత్రి మిగతా2లో...

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

- ఖరారు చేసిన బిజెపి అదిష్టానం



**హైదరాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిని భాజపా ప్రకటించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ.. బీజేపీ అభ్యర్థిని ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. లంకల దీపక్‌రెడ్డి పేరు ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2023 ఎన్నికల్లోనూ దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ భాజపా అభ్యర్థిగా పోటీ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. అభ్యర్థి ఎంపిక కోసం నియోజకవర్గంలోని పలువురి సీనియర్ల పేర్లను బీజేపీ పరిగణలోకి తీసుకుంది. అందుకు సంబంధించిన జాబితాను రూపొందించి.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు న్యూఢిల్లీ తీసుకు వెళ్లి.. బీజేపీ అధిష్టానం ముందు ఉంచారు. అధిష్టానం లంకల దీపక్ రెడ్డిని ఎంపిక మిగతా2లో...




## కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు

- 12 మంది అఫ్గన్ పౌరుల మృతి

# పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

● జూబ్లీహిల్స్‌లో సునీత నామినేషన్‌లో పాల్గొన్న కెటిఆర్ ● జూబ్లీహిల్స్ నుంచి బిఆర్ఎస్ విజయయాత్ర అన్న కెటిఆర్



**హైదరాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఎన్నిక పార్టీలు, ఇద్దరు వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని.. పదేండ్ల అభివృద్ధి, పాలనకి.. రెండు సంవత్సరాల అరాచక పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. పదేళ్ల రైతుబంధు పాలనకు, రెండు సంవత్సరాల రాక్షస పాలనకి మధ్య జరుగుతున్న ఎన్నికగా పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో ఆడబిడ్డ గెలుపు కోసం రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలు ఎదురు చూస్తున్నారని.. ఆమె గెలుపుతోనైనా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.2500 ఇస్తుందని ఆశిస్తున్నారన్నారు. లక్షల మంది రైతన్నలు ఈమె గెలుస్తుందని ఆశిస్తున్నారని తెలిపారు.ఆ తర్వాతే తమకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేస్తుందని.. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, తర్వాత మోసపోయిన యువతి యువకులు ఎదురు చూస్తున్నారు. తమ ఇళ్లు కూలగొట్టిన అరాచకాలను చూసిన తర్వాత, ఈ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలవాలని, ఆ అరాచకాలు ఆగాలని హైదరాబాద్ నగర పేదలు మిగతా2లో...

# మావోయిస్టులకు వరుస దెబ్బలు

(మొదటి పేజీ తరువాయి)

లొంపోతున్నారు. లొంగిపోయిన వారు బతికిపోతే.. లొంగని వారు తూటలకు బలవుతున్నారు. వచ్చే మార్చిలోగా మావోలను అంతం చేస్తామని, ఆపరేషన్ కగార్ చేపట్టి వందలాది మందిని మట్టుపెట్టారు. ఈ క్రమంలో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఇదిలావుంటే మావోయిస్టు పార్టీకి మరో బిగ్ షాక్ తగిలింది. మల్లోజుల బాటలో కీలక నేతలు నడిచేందుకు సిద్ధమయ్యారు. మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న పోలీసుల ఎదుట లొంగిపోయేందుకు రెడీ అయ్యారు. గురువారం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ముందు ఆశన్న లొంగిపోనున్నారని సమాచారం. ఆయనతో పాటు మరో 70 మంది మావోయిస్టులు కూడా సీఎం ముందు జనజీవన స్రవంతిలో కలవనున్నారు. బుధవారం ఛత్తీస్‌గఢ్ లోని సుక్మా జిల్లాలో 27 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు ప్రకటించారు. వీరిపై రూ.50లక్షల రివార్డు ఉంది.

సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు అలియాస్ అభయ్ అధికారికంగా పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో ఈ మేరకు మల్లోజులను పోలీసులు మీడియా ముందుకు తీసుకొచ్చారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ సమక్షంలో ఆయన ఆయుధాలు అప్పగించారు. ఈ రెండు షాకులతో మావోస్టులు అల్లాడుతుంటే.. తాజాగా ఆశన్న లొంగిపోతున్నారనే వార్త.. వారికి మరో దెబ్బ తగినట్లే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత, దాదాపు రెండో స్థానంలో చలామణి అవుతున్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 60 మంది ఉద్యమ సహచరులతో కలిసి బుధవారం ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఎదుట అధికారికంగా లొంగిపోయారు. సీఎం సమక్షంలో వీరంతా తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మల్లోజుల, ఆయన బృందాన్ని సీఎం ఫడణవీస్ జన జీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. తీవ్ర ఒడిదొడుకులతో సాయుధ ఉద్యమం బలహీనపడుతోందన్న ప్రచారం నేపథ్యంలో మావోయిస్టు పార్టీకి ఇది ఇబ్బందికర పరిణామంగా గమనించాలి. మావోయిస్టు పార్టీ వైఖరి సరిగా లేదంటూ కొన్ని రోజులుగా మల్లోజుల బహిరంగ లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే పార్టీలో దశాబ్దాలుగా జరుగుతున్న తప్పిదాలకు తానే కారణమని పేర్కొంటూ అత్యున్నత నిర్ణాయక కమిటీ పొలిట్‌బ్యూరో నుంచి వైదొలిగారు. తాజాగా ఉద్యమాన్ని పూర్తిగా వదిలిపెట్టి అజ్ఞాతం వీడారు. మల్లోజులపై వందకు పైగా కేసులు ఉన్నాయి.మల్లోజుల సొంత రాష్ట్రం తెలంగాణ. పెద్దపల్లికి చెందిన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు వేణుగోపాల్‌రావు మూడో సంతానం. తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన తండ్రి నుంచే వేణుగోపాల్, ఆయన రెండో అన్న కోటేశ్వరరావు స్ఫూర్తి పొందారు. చదువు పూర్తయిన అనంతరం తన అన్న పిలుపు మేరకు ఉద్యమంలో ప్రవేశించారు. పార్టీలో ఆయనను అభయ్, సోను, భూపతి, వివేక్ పేర్లతో పిలిచేవారు. వీరిలో పది మంది మహిళలు ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం రూ.50 లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు. మావోయిస్టు కంచుకోట బస్తర్‌లో సైతం గడ్చిరోలి తరహా భారీ ఎత్తున మావోయిస్టులు లొంగిపోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీ ఉత్తర బస్తర్ డివిజన్ ఇన్‌ఛార్జి రాజ్ మాన్ సహా పలువురు లొంగిపోనున్నట్లు సమాచారం. బస్తర్ ఐజీ సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ ఇంద్ర కళ్యాణ్ ఈ మేరకు మావోయిస్టులతో చర్చలు జరుపుతున్నారు.

# పుట్టెడు దుఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానిస్తారా...?

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో దుఖంలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కాంగ్రెస్ మంత్రులు మాగంటి సునీతని అవమానించే విధంగా నానా మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. విజ్ఞత మరిచి, విచక్షణ లేకుండా చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజలు విజ్ఞులని.. మంచి, చెడులని ఆలోచిస్తారని తెలిపారు. మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిపించాలని కోరారు హరీశ్‌రావు.బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి పలువురు నేతలు బీఆర్ఎస్ లోకి చేరారు. హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు, కార్యకర్తలకి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక ఆడబిడ్డను ఆశీర్వదించాలనే పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ఏం చేసిందనేది ఒకసారి ప్రజలు ఆలోచించాలని సూచించారు. తెలంగాణకి కాంగ్రెస్, బీజేపీ ద్రోహం చేశాయని విమర్శించారు హరీశ్‌రావు. కాంగ్రెస్, బీజేపీలు చెప్పేదొకటి, చేసేదొకటని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ మొహబ్బత్‌కి దుకాణ్ అని అంటారని.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటారని తెలిపారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతోంది ఏమిటి..?.. హైడ్రా పేరిట పేదవారి ఇళ్లు కూలగొట్టడం మొహబ్బత్ దుకాణ్ ఆ..? అని ప్రశ్నించారు. బడా బాబుల ఇళ్లు ఎందుకు కూలగొట్టడం లేదని నిలదీశారు. గరీబోళ్ల ఇల్లు కూలగొట్టి వేల కుటుంబాలను రోడ్డుమీదకి సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ బిహార్‌లో ఓటు చోరీ అంటున్నారని... జూబ్లీహిల్స్ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి మాత్రం ఓటు చోరీ చేస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో రేవంత్‌రెడ్డి ఓటు చోరీ చేయకుండా నిజాయితీగా ఉండాలని చెప్పాల్సిన బాధ్యత రాహుల్ గాంధీకి లేదా అని ప్రశ్నించారు హరీశ్‌రావు. 'జూబ్లీహిల్స్‌లో భర్తను కోల్పోయిన సునీతని ఒడగొట్టాలని.. 20 వేల దొంగ ఓట్లను కాంగ్రెస్ కూడగట్టింది. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని అన్నారు. ప్రతి అక్కకు, చెల్లెకు కాంగ్రెస్ రూ.55,000 బాకీ పడింది. జూబ్లీహిల్స్‌లో మహిళలకు ఒక్కొక్కరికీ రూ.55,000 ఇచ్చి రేవంత్‌రెడ్డి సర్కార్ ఓటు అడగాలన్నారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ ఇస్తా అన్నారని.. ఇవ్వకుండా మోసం చేశారు. ఒక అవ్వకు, తాతకు రూ.44,000 రేవంత్‌రెడ్డి బాకీపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిందేముంది.. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టుడు తప్ప అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రతి బస్తీకి బస్తీ దవాఖాన పెట్టారు. హైదరాబాద్‌లో 350 బస్తీ దవాఖానాలని కేసీఆర్ ఏర్పాటు చేశారు. కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం మందులు ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో గర్భిణులు డెలివరీకి పోతే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేసి కేసీఆర్ కిట్ ఇచ్చి ఆటోలో ఇంటికాడ దిగబెట్టాం. రేవంత్‌రెడ్డి సర్కార్‌లో బతుకమ్మ చీరలు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు ఇవ్వట్లేదు. కేసీఆర్ హయాంలో 20,000 లీటర్ల నీళ్లు ఉచితంగా ఇస్తే.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి నల్లా బిల్లు వసూలు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో గరీబోళ్లకి నీళ్లు ఉచితంగా ఇచ్చాం. భాగ్యనగరంలో నల్లా సమస్యలు పెరిగాయి. అధికారులు నల్లా బిల్లులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్‌ని జూబ్లీహిల్స్ ఎన్నికలో ఓడిస్తేనే బుద్ధి వస్తుంది' అని హరీశ్‌రావు విమర్శించారు. 'తెలంగాణలో ఆరు గ్యారెంటీలని 100 రోజుల్లో అమలు చేస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో చెప్పించారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీలని పూర్తిగా అమలు చేయడం లేదు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రావడమే కష్టం. భర్తను కోల్పోయిన ఆడబిడ్డను మీరందరూ దీవించాలి. బీజేపీ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అంటుంది. కానీ గోదావరి పుష్కరాలకు.. ఆంధ్రప్రదేశ్‌కి రూ.100కోట్లు ఇచ్చి తెలంగాణకు గుండు సున్నా ఇచ్చింది. ఇది సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ ఎలా అవుతోంది..?. తెలంగాణ నీటిని దోపిడీ చేసే బనకచర్ల ప్రాజెక్టుకి బీజేపీ ప్రభుత్వం మద్దతిస్తోంది. అనుమతులు ఇస్తోంది. తెలంగాణకు ఏమి ఇస్తున్నారో బీజేపీ నాయకులు చెప్పాలి. దేశంలో 157 మెడికల్ కాలేజీలు ప్రకటిస్తే ఒక్క మెడికల్ కాలేజీని కూడా తెలంగాణకు ఇవ్వలేదన్నారు. 'తెలంగాణలో బీజేపీకి 8 ఎంపీలను గెలిపిస్తే.. రాష్ట్రానికి మీరు చేసిన మంచి ఇదేనా. గోధుమలకు రూ.2,585, వడ్లకు రూ.2,369 ఇస్తున్నారని... గోధుమలకు ఓ నీతి వడ్లకు మరో నీతి ఉంటుందా..?. అన్నారు. 2014లో బీజేపీ అధికారంలో వచ్చిన నాడు గోధుమలకు, వడ్లకు రూ.1400 మద్దతు ధర ఉండేది. గోధుమలకు మద్దతుధర పెంచి వడ్లకు పెంచకపోవడం తెలంగాణ రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. కాంగ్రెస్‌కి నిజాయితీ ఉంటే బాకీ కార్డు పంపిస్తాం. మీరు పడ్డ బాకీని చెల్లించి జూబ్లీహిల్స్‌లో ఓటు అడగాలని పేర్కొన్నారు. తెలంగాణ గొంతు నొక్కడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగింది. ఆడపిల్ల పెళ్లికి కల్యాణలక్ష్మి, గర్భిణులకి కేసీఆర్ కిట్టు ఇచ్చాం. రూ.2000ల పెన్షన్ ఇచ్చి అవ్వాతాతల గౌరవం పెంచాం. షీ టీమ్స్‌తో ఆడపిల్లల భద్రత పెంచాం. కాంగ్రెస్‌వి మొసలి కన్నీళ్లు, ఆపద మొక్కులు తప్పా ప్రజల సంక్షేమం పట్టదని విమర్శించారు.

## హ్యామ్ రోడ్ల నిర్మాణంపై నేటి కేబినేట్‌లో నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. రేపు క్యాబినెట్‌లో తీసుకునే నిర్ణయం రాష్ట్ర రోడ్ల నిర్మాణానికి మైలురాయిగా ఉంటుందని, వచ్చే 30 నెలల్లో తెలంగాణలో 'దేశంలోనే బెస్ట్ రోడ్స్' అనే పేరుని అందించగల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రోడ్ల నిర్మాణం దశలవారీగా, హ్యామ్ విధానం ప్రకారం అమలు చేయబడనుంది. అదేవిధంగా, పేద ప్రజలకు కార్పోరేట్ స్థాయి వైద్యం అందించే టిమ్స్ హాస్పిటల్స్ పనుల్లో వేగం పెంచి, అత్యంత త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు కూడా ఆయన తెలిపారు.

## రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

**సంగారెడ్డి,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని కేతావత్ శర్మన్ నాయక్ (55) అనే వ్యక్తి మృతి చెందారు. సంఘటన చిలిపిచెడ్ మండలం సోమక్కపేట్ శిలంపల్లి రోడ్ మార్గంలో జరిగింది. ఎస్సై నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రహీంగూడ తండా గ్రామపంచాయతీ పరిధిలోని అంబర్య తాండకు చెందిన కేతావత్ శర్మన్ నాయక్ (55) శిలాంపల్లి నుండి తన ఇంటికి వస్తున్న మార్గమధ్యంలో రెండు బైకులు ఢీకొని శర్మన్ నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. సోమక్కపేట గ్రామానికి చెందిన బందేల్లి, గంగిరెద్దుల గూడెంకు చెందిన శ్రీనుకు గాయాలు కాగా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.మృతున్ని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింలు తెలిపారు.

## అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

● రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటి ఉపయోగం: ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడి



**బెంగళూరు,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** అంతరిక్ష మిషన్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ బిగ్ డేటా వంటివాటిని ఉపయోగించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ అన్నారు. వికసిత భారత్‌కు దూతగా 2040లో భారతీయ వ్యోమగామి చందమామపై అడుగుపెట్టనున్నాడని నారాయణన్ పేర్కొన్నారు. అంతరిక్ష రంగ అభివృద్ధి కోసం ప్రస్తుతం ఇస్రో అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టినట్లు నారాయణన్ వెల్లడించారు. వాటిలో 80వేల కేజీలను మోసుకెళ్లే రాకెట్లను తయారుచేయడం, 2026లో వ్యోమమిత్ర అనే రోబోను అంతరిక్షంలోకి పంపడం, 2035 నాటికి జాతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రుడిపై అధ్యయనం కోసం వీనస్ ఆర్బిటర్ మిష ఏర్పాటు వంటి లక్ష్యాలను ఏర్పరుచుకున్నామన్నారు. 2027లో చేపట్టబోయే మానవ సహిత గగనయాత్ర మిషన్ ట్రాక్‌లో ఉందని వెల్లడించారు. 2040 నాటికి తొలి మానవసహిత జాబిల్లి యాత్ర చేపట్టాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని..అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారేందుకు అంతరిక్ష కార్యక్రమంలో ఈ యాత్ర కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇస్రో ప్రణాళికలను పంచుకున్న వి. నారాయణన్ గగన్‌యాన్‌లో భాగంగా తాము మరిన్ని ప్రయోగాలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. చంద్రుడి ఉపరితల నమూనాలను భూమికి తీసుకొచ్చేందుకు 2027లో ప్రతిష్ఠాత్మక చంద్రయాన్-4 ప్రయోగాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. కొన్నేళ్ల క్రితం అంతరిక్షరంగంలో రెండు లేక మూడు స్టార్టప్‌లు మాత్రమే ఉండేవని.. ప్రస్తుతం ఉపగ్రహ తయారీ, ప్రయోగ సేవలు, అంతరిక్ష ఆధారిత డేటా విశ్లేషణలపై అధ్యయం కోసం 300 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని ఇస్రో చీఫ్ అన్నారు. వ్యవసాయం, విపత్తు ప్రతిస్పందన, నిర్వహణ, టెలికమ్యూనికేషన్, రియల్-టైమ్ రైలు, వాహన పర్యవేక్షణలో ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల అధ్యయనానికి ఇవి ఉపయోగపడతాయన్నారు.

# నేడు శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జునిడిని దర్శించుకుంటా...

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో కర్నూలు జిల్లా పర్యటనపై ప్రధాని మోదీ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఆసక్తికర ట్వీట్ పెట్టారు. అచ్చమైన తెలుగులో ఈ ట్వీట్ పెట్టారు ప్రధాని మోదీ. ఆంధ్రప్రదేశ్‌లో 'రేపు అంటే అక్టోబర్ 16వ తేదీన పర్యటిస్తాను. శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తాను. ఆ తర్వాత కర్నూలులో రూ.13, 400 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటాను. ఈ పనులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవి ఉన్నాయని ప్రధాని మోదీ తన ట్వీట్ ద్వారా వెల్లడించారు.

## వందేభారత్ 4.0 వర్షన్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

కానుందని వెల్లడించారు.సీఐఐ ఇంటర్నేషనల్ రైల్ కాన్ఫరెన్స్‌లో కేంద్రమంత్రి మాట్లాడారు. మోదీ రైల్వేల అభివృద్ధిపై బలంగా దృష్టి సారించిందని వెల్లడించారు.11 ఏళ్లలో 35,000 కిలోమీటర్ల మేర రైల్వే ట్రాక్‌ల నిర్మాణం జరిగిందని చెప్పారు. జపాన్ బుల్లెట్ రైల్ నెట్‌వర్క్ మాదిరిగానే హైస్పీడ్ ప్యాసింజర్ రైల్ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు చెప్పారు. గరిష్ఠంగా గంటకు 350 కి.మీ వేగంతో రైలు ప్రయాణించేలా వాటి డిజైన్ ఉంటుందని తెలిపారు.

## జూబ్లీహిల్స్ బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దాంతో ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. బుధవారం నామినేషన్ దాఖలు చేసారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరోవైపు అధికార కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.. ఎన్ని కల ప్రచారంలో ఇప్పటికే దూసుకు పోతున్నారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెం బ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ బరిలో దిగి గెలిచారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన ఇటీవల మరణించారు. ఇక బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి తాజాగా ప్రకటించింది. ఉప ఎన్నిక పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగను ంది. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14వ తేదీన వెల్లడి కానున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనేది ఆ రోజుతో తెలిపోనుంది. అనారోగ్య కారణాలతో ఈ ఏడాది జూన్ 8న బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. ఆయన మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## పదేళ్ల అభివృద్ధికి..రెండేళ్ల అరాచకానికి మధ్య పోరు

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటున్నారన్నారు. మూతపడుతున్న బస్తీ దావఖానాలు, ఉచిత తాగునీరు ఆగిపోతున్న విషయాలు ప్రజలందరూ చూస్తున్నారని.. కాంగ్రెస్ పార్టీ ఒక ఇల్లు కూడా హైదరాబాదులో కట్టలేదని.. కేసీఆర్ కట్టిన హైదరాబాద్‌లో కట్టిన లక్ష ఇళ్లు, ఇచ్చిన ఇళ్ల పట్టాలు, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అన్నీ కూడా హైదరాబాద్ నగర ప్రజలకు గుర్తుకు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన మైనార్టీలకు ఈ ఎన్నిక ఒక అవకాశంగా భావిస్తున్నారని.. ప్రభుత్వంలో ఒక్క మైనార్టీకి కూడా అవకాశం ఇవ్వకుండా దారుణంగా వారిని అవమానపరిచిన మైనార్టీలు, ఈ ఎన్నికను రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడానికి ఒక అవకాశంగా భావిస్తున్నట్లుగా చెప్పారు. తమకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్, రిజర్వేషన్లు అన్నీ మోసమని, గుణపాఠం చెప్పడానికి రాష్ట్రవ్యాప్తంగా బీసీలు సిద్ధంగా ఉన్నారని.. దళితబంధు, అభయహస్తం అని చెప్పి మోసం చేసిన దళితులు కూడా ఆగ్రహంతో ఉన్నారని.. తమ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి మద్దతు వెల్లువెత్తుతున్నదని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ఆధ్వర్యంలో మరోసారి పాలన రావడానికి, హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ఈ ఉప ఎన్నిక పునాది కాబోతున్నదన్నారు.

## కాందహార్‌లో పాక్ వైమానిక దాడులు

**ఇస్లామాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాందహార్ ప్రావిన్స్‌లోని పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాకిస్థాన్ దళాలు జరిపిన వైమానిక దాడుల్లో 12మందికి పైగా ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇది తాలిబన్ - పాకిస్థాన్ దళాల మధ్య తాజాగా కాల్పులకు దారితీశాయి. దీంతో రెండు పాత మిత్రదేశాల మధ్య వైరం తీవ్రతరమైంది. దీనిపై ఇరుపక్షాలూ ఒకరిపై మరొకరు ఆరోపణలు గుప్పించుకున్నాయి. బుధవారం ఉదయం, కాందహార్‌లోని స్పిన్ బోల్డాక్ జిల్లాపై పాకిస్థాన్ దళాలు తేలికపాటి, భారీ ఆయుధాలతో దాడులు ప్రారంభించాయి. ఫలితంగా 12మందికి పైగా ఆఫ్ఘాన్ పౌరులు అమరులయ్యారు. కనీసం 100 మంది గాయపడ్డారని ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. పాకిస్థాన్ చేసిన దాడి.. ఒక నివాస భవనాన్ని తాకడంతో ఆ ఇంట్లో చాలామంది పిల్లలు చనిపోయినట్టు తెలుస్తోంది. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. దీంతో ఆఫ్ఘన్ దళాలు కూడా ప్రతీకార చర్యకు దిగాయి. కాగా, పాకిస్థాన్ జరిపిన దాడిలో 15మంది పౌరులు మరణించారని ంఈఖ వార్తా సంస్థ నివేదించింది. గాయపడిన వారిలో 80మందికి పైగా మహిళలు, పిల్లలు ఉన్నార ని తెలిపింది. బుధవారం నాడు కాబూల్ శివార్లలో ఒక ఇంధన ట్యాంకర్ పేలింది. ఫలితంగా, భారీ అగ్నిప్రమాదం సంభవించిందని టోలోన్యూస్ నివేదిం చింది. వివాదం తగ్గే సూచనలు కనిపించకపోవడం, పాకిస్థాన్ మంత్రులను చర్చలకు ఆఫ్ఘనిస్తాన్ అనుమతించకపోవడంతో మధ్యవర్తులుగా వ్యవహరించ డానికి ఖతార్, సౌదీ అరేబియాకు ఇస్లామాబాద్ ఫోన్ చేసినట్టు తెలుస్తోంది.

# జూబ్లీహిల్స్‌లో సాకులు వెదుకుతున్న బిఆర్ఎస్

- ఓటమి భయంతో ముందే కుంటిసాకులు: శ్రీధర్ బాబు

**హైదరాబాద్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్‌లో ఓటమి భయంతో బిఆర్ఎస్ రకరకాల ప్రచారాలు చేస్తోందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.దేశంలో ఓట్ల చోరీ జరిగిందని చెప్పిందే కాంగ్రెస్ అని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓడిపోతామనే బీఆర్ఎస్ నేతలు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఓటర్ల జాబితా తయారు చేసిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది రామరాజ్యమని అభివర్ణించారు. తెలంగాణలోని ప్రజలందరూ రామరాజ్యాన్ని కోరుకుంటున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇదిలావుంటే మంత్రుల మధ్య వివాదాలపై మంత్రి శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రుల మధ్య వివాదాలు లేవని స్పష్టం చేశారు. తాను సీనియర్ కాంగ్రెస్ వాదినని చెప్పుకొచ్చారు. తనకి నీచ రాజకీయం చేసే శక్తి లేదు.. యుక్తి అంతకన్నా లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. తాను పార్టీని నమ్ముకొని ఉన్నానని క్లారిటీ ఇచ్చారు. హైదరాబాద్‌లో బుధవారం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. పార్టీని నమ్ముకోకుండా అటు, ఇటు పోయే వ్యక్తిని తాను కాదని స్పష్టం చేశారు. తాను పార్టీని బలోపేతం చేసే వ్యక్తినని చెప్పుకొచ్చారు.

# 1962 అంబులెన్స్ సిబ్బందికి జీతాలు విడుదల చేయాలి

## - ప్రభుత్వానికి వేడుక




**పరకాల, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 1962 మౌలిక వెటర్నరీ అంబులెన్స్ సర్వీసు ద్వారా ఇప్పటివరకు వేలాది మూగజీవులకు ప్రాణాధారంగా సేవలందిస్తున్నారు. ఎటువంటి ఆపదల సమయంలో 1962 నెంబర్‌కు ఫోన్ చేసిన వెంటనే అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకొని, అక్కడే ప్రథమ చికిత్స అందిస్తూ, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ సేవల్లో డాక్టర్, టెక్నీషియన్, కెప్టెన్, సహాయకుడు సిబ్బంది నిరంతరం పని చేస్తున్నారు.అయితే, గత మూడు నెలలుగా జీతాలు విడుదల కాలేదు. దీని కారణంగా సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువుల ఖర్చులు, అప్పుల భారం లాంటి సమస్యలు వారికి మానసికంగా భారంగా మారుతున్నాయి. సమయానికి జీతాలు అందలేదంటే, వారు బాధ్యతగా తమ సేవలను కొనసాగించలేని పరిస్థితి వస్తుందని తెలిపారు. ప్రతినెల జీతాలు క్రమం తప్పకుండా అందితే, మేము మరింత నిబద్ధతతో పని చేయగలుగుతాము. కానీ జీతాలు లేకపోవడం వల్ల మా కుటుంబాలు గడవడం కష్టంగా మారింది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, ప్రభుత్వం తక్షణమే స్పందించి వాయిదా పడిన మూడు నెలల జీతాలను విడుదల చేయాలని వారు కోరుతున్నారు. లేదంటే, విధి విరుద్ధంగా మెరుపు సమ్మెకు కూడా దిగే పరిస్థితి రానుందన్నారు.మా పరిస్థితిని అర్థం చేసుకొని, మూగజీవులకు సేవలందిస్తున్న మాకు సమయానికి జీతాలు అందించగలరు.

# 18న జరుగు బీసీల రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు డా.సిరికొండ శ్రీనివాసాచారి



**పరకాల, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ల కోసం బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (JAC)ఆధ్వర్యంలో జరగనున్న "రాష్ట్ర బంద్ "ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు,విద్యావేత్త ,ఎస్వీ విద్యాసంస్థల అధినేత డా?సిరికొండ శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీ ఓ 9 కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ,రిజర్వేషన్ ల బిల్లును షెడ్యూల్ 9లో చేర్చాలని ఇందు కోసం కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు . 30 బీసీ సంఘాల వాదనలు వినకుండా ఎన్నికల షెడ్యూల్ విడుదలచేసిన తరువాత హైకోర్ట్ స్టే ఇవ్వడం బీసీ లను మోసం చేయడమేనని అన్నారు.ఇట్టి రిజర్వేషన్ సాధించేవరకు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కొసం చేసిన తరహ ఉధృతమైన ఉద్యమాలు, పోరాటాలు సాగిస్తామని తెలిపారు.ఇందుకోసం ఈ నెల 18 న రాష్ట్ర వ్యాప్తంగా జరుగు బీసీ ల బంద్ ను అన్నివర్గాల ప్రజలు, కులాలు, మతాలకు అతితంగా స్వచ్ఛందంగా బంద్ పాటించి,సహకరించి బంద్ ను విజయవంతం చేయగలరని డా.సిరికొండ శ్రీనివాసచారీ కోరారు. ఈ కార్యక్రమము లో బీసీ రాష్ట్ర నాయకులు ఎడ్ల సుధాకర్,బసాని సోమరాజుపటేల్,డా.శివదేవ్,సూత్రపు శివాజీగణేష్ నాయి,సూర సతీష్ పటేల్,అల్లం మధుసూదన్ ముదిరాజ్, మహిళా నాయకులు దుంపేటి యశోద,మౌనిక,తూముల అనిత,లక్కం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత గాలికుంటు నివారణ టీకాలను రైతులు ఉపయోగించుకోవాలి

- మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి





**వెల్గటూర్,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎండపల్లి మండల కేంద్రంలో గాలికుంటు నివారణ కార్యక్రమంలో వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, ఎండపల్లి పశు వైద్యాధికారి బూర మనోజ్ కుమార్ తో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, గ్రామంలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణా కార్యక్రమములో భాగంగా వెల్గటూర్ ప్రాథమిక పశువైద్య అధికారి పి.శ్రీ ప్రియ 78 ఆవులకు 64 గేదెలకు నివారణ టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమములో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సప్త లింగయ్య , మహిపాల్ రెడ్డి, మాచర్ల సంజీవ్, రైతులు వెంకటేష్, జానీ, నాయకులు బోరకుంట రాజయ్య ముచ్చర్ల కొమురయ్య యాదవ్, పశువైద్య సిబ్బంది ఎల్.ఎస్.ఏ.కె.సంధ్య, వి.ఏ.కె. నాగరాజు, ఓఎస్లు కే నారాయణ, రాజకుమార్, చంద్రయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతులమీదుగా ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వేములకొండ సోమశేఖర్ గౌడ్




**హైదరాబాద్ అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** లీడ్ ఇండియా 20 25, ఉత్తమ అధ్యాపక అవార్డు ప్రధాన ఉత్సవం ఈరోజు సాయంత్రం రవీంద్ర భారతి లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జి ష్ణుదేవ్ వర్మ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ప్రకృతితో మమేకమవుతూ దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, దేశ రక్షణ దేశ భవిష్యత్తు కొరకు ప్రతి ఒక్క విద్యార్థి పాటుపడే విధంగా తీర్చిదిద్దాలని కోరడం జరిగింది.లీడ్ ఇండియా 20 25 తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు ప్రధాన ఉత్సవం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జి ష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా విజ్ఞాన్ జ్యోతి గ్రామర్ హై స్కూల్ ప్రిన్సిపల్ వేములకొండ సోమశేఖర్ గౌడ్ కు అవార్డు బహుకరించి, శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా నిర్వాహకులు, సుదర్శన్ ఆచార్య, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా శ్యామరావు



**మల్లంపల్లి మండల ప్రతినిధి అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కాంగ్రెస్ కమిటీకి ల్యాద శ్యామరావు అధ్యక్షుడిగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఘనంగా జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై శ్యామరావు ను అభినందించారు.ఈ సందర్భంగా ల్యాద శ్యామరావు మాట్లాడుతూ, మండల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతం నా ప్రధాన లక్ష్యాలు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత చైతన్యవంతం చేస్తాను. ప్రజల నమ్మకాన్ని గెలుచుకునేలా పనిచేస్తాను" అని తెలిపారు.మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ల్యాద శ్యామరావు నాయకత్వంలో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత శక్తివంతంగా ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డాక్టర్ గణేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, యువకార్యకర్తలు, మహిళా నాయకులు, సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



# బాలింతలకు పౌష్టికాహారం అందించడం అత్యంత ముఖ్యం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి







**ఆత్మకూర్, అక్టోబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** బాలింతల ఆరోగ్యం, పుట్టబోయే శిశువు అభివృద్ధికి పౌష్టికాహారం కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలంలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పోషణ మాసం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లి, శిశువు ఇద్దరి ఆరోగ్యం కాపాడబడుతుంది. కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా గర్భిణీలు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం, వైద్యపరీక్షలు, మందులు ఉచితంగా అందజేస్తోంది" అని తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యకర జీవనశైలిని పాటించాలంటూ మహిళలకు పిలుపునిచ్చారు.అలాగే, గ్రామాల్లో ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బాలింతలకు ఆశీర్వాదం చేసి పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, గుడెప్పడ్ ఎఎంసీ చైర్మన్ బీరం సునంద–సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యులు ముద్దం సాంబయ్య, ఏరుకొండ రవీందర్, పరికరాల వాసు, కక్కెర్ల రాజు, మార్క రజనీకర్, అర్షం వరుణ్ గాంధీ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తనుగుల సందీప్, జిల్లా సంక్షేమ అధికారి జే. జయంతి, తాసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, సిడిపిఓ స్వాతి, నసీమా, ఉమాదేవి తదితర అధికారులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## డాక్టర్ బంగారి స్వామిని సన్మానించిన హాఫీజ్ యూసుఫ్...



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** యూరప్ లోని ప్రముఖ దేశమైన స్విట్జర్లాండ్ బెర్న్ లో.. డాక్టర్ గ్రైచిన్ ఆధ్వర్యంలో రోబోటిక్ మోకాలి కీలు మార్పిడి సర్జరీ ట్రైనింగ్ విజయవంతం గా పూర్తి చేసుకొని కరీంనగర్ కు తిరిగివచ్చిన రేనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేత, సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, జయింట్ రీప్లేస్ మెంట్, స్పైన్ సర్జర్ ప్రొఫెసర్ డాక్టర్ బండారి స్వామిని, ఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రెటరీ, సున్ని మరకజీ మీలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్ బుధవారం నగరంలోని రేనే ఆసుపత్రిలో మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా సన్మానించారు. ప్రపంచస్థాయి రోబోటిక్ ఆర్థోపెడిక్ సేవలు కరీంనగర్ వేదికగా ఉత్తర తెలంగాణ ప్రజలకు అందించాలనే సంకల్పంతో స్విట్జర్లాండ్‌లో విజయవంతంగా శిక్షణను పూర్తి చేసుకున్నందుకు బంగారు స్వామికి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బంగారి స్వామి మంచి మనసున్న డాక్టర్ అని పేద మధ్యతరగతి ప్రజల పట్ల ఆత్మీయత దయ ప్రేమానురాగాలను చూపించే మంచి మనిషి అని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో ఇంతింతై వటుడింతై మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. రేనే ఆసుపత్రి సేవలను ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి గడిచేలా ముందుకు తీసుకెళ్లేలా ఆ భగవంతుడు డాక్టర్ బంగారి స్వామికి మరో ధైర్యాన్ని కల్పించాలని కోరారు.

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు

**- ప్రిన్సిపాల్ మేకల రమేష్**





**చిట్యాల, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండల కేంద్రంలో. ఉన్న ఆదర్శ పాఠశాల కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను. ఘనంగా జరుపుకున్నారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసిఅనంతరం ప్రిన్సిపాల్ మేకల రమేష్ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ. అబ్దుల్ కలాం దేశానికి ఎనలేవ సేవ చేశారని ఇంజనీర్ గా శాస్త్రవేత్తగా భారత రాష్ట్రపతిగా తమ సేవలను అందించారని మనం ఏదైనా సాధించాలంటే దానికి కోరిక ఆశ నమ్మకం ఈ మూడింటి పైన దృష్టి పెట్టాలని మీ మీద మీకు నమ్మకం ఉండాలని అనేవారు మీ గమ్యాన్ని చేరాలంటే పట్టుదలతో కృషి శ్రమ చేయాలని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నీలం రవీందర్. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాసాల వెంకటేశ్వర్లు. వాణి జ్యోత్స్నా శివ ప్రసాద్ రాజు. ఆయేషా శ్రీలత.కలీం పాషా రామస్వామి. భాస్కరు పుట్ట రాజు. మోరేసాగర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**- ఆరుగురి వ్యక్తులపై కేసు నమోదు: ఎస్సై శ్రావణ్ కుమార్**




**చిట్యాల అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):**చిట్యాల మండలం జూకల్ గ్రామంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని సమాచారం అందుకున్న చిట్యాల ఎస్సై శ్రవణ్ కుమార్ తన సిబ్బందితో అట్టి పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులని 52 పేకముక్కలని మరియు 2000/- రూపాయల నగదును స్వాదిన పరుచుకున్నామని తెలిపారు పట్టుకున్నారు పేకాడుతున్న జూకల్ గ్రామానికి చెందిన వ్యక్తులు కావాటి రాజు సూర లక్ష్మణ్. తోట శ్రవణ్. సుర శ్రీకాంత్.తోట బిక్షపతి. శ్రీగిరి రవీందర్ దాడిలో కానిస్టేబుల్స్ అస్లాం. జానీ, నాగరాజు. సందీప్ పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి...



**- మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**





**మానకొండూర్,అక్టోబర్15(పీసీడబ్ల్యూ న్యూస్):** దళారుల బారినపడి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వపరంగా ఏర్పాటు చేస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఉండేందుకే బుధవారం మానకొండూర్ మండలం దేవంపల్లి, కెల్లేడు,రంగపేట,పచ్చునూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఐకేపీ,సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్య కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరను పొందాలని కోరారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే మద్దతు ధరను పెంచిందన్నారు. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలను పాటించాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమాల్లో మానకొండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, డైరెక్టర్లు సహదేవ్, రామిడి శ్రీనివాస్ రెడ్డి, సాయిరి దేవయ్య, దాసరి శ్రీనివాస్, టేకుమల్ల అంజయ్య, చలిగంటి ఓదెలు, రావుల రవి, తాళ్లపల్లి సంపత్ గౌడ్ ,ద్యావ శ్రీనివాస్ రెడ్డి, వాల అంజుత్ రావు, బండి మల్లేశం, రామిడి తిరిపతి, నాగిశెట్టి రాజయ్య, తోట శ్రీనివాస్, బోళ్ల మురళీధర్, కనకం కుమార్, కనకం అశోక్, కోంద్ర సురేశ్,మడుపు ప్రేమ్ కుమార్, తాళ్లపల్లి నరేష్, దుడ్డెల కుమార్, తాళ్లపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులపై జులుం చేస్తే ఊరుకునేదిలేదు

**● ఫుట్ పాత్ పై షాపుల తొలగింపుపై , వీధి వ్యాపారులకు మద్దతుగా ఎంఐఎం నేతల ఆందోళన ● వీధి వ్యాపారులకు అన్యాయం జరగనివ్వం.. సుడా చైర్మన్ హామీతో విరమణ...**





**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలో ఎక్కడైనా వీధి వ్యాపారులపై ప్రభుత్వ అధికారులు ఎవరైనా జులుం చేస్తే, ఊరుకునేది లేదని ఫుట్ పాత్ వ్యాపారులకు అండగా ఎంఐఎం పార్టీ ఆందోళన పంథాను కొనసాగిస్తుందని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం ఎదురుగా, మున్సిపల్ గెస్ట్ హౌజ్ ను ఆనుకొని, గత రెండు దశాబ్దాలుగా ఫుట్ పాత్ను నమ్ముకొని వ్యాపారాలు చేసుకుంటున్నా వీధి వ్యాపారుల దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనాదిగా ఫుట్ పాత్ ను నమ్ముకొని జీవిస్తున్న పేదల దుకాణాలను ఎలా కూల్చుతారు అంటూ, మున్సిపల్ గెస్ట్ హౌస్ ప్రహరీ గోడ నిర్మాణం ఐదు ఫీట్లు వెనక్కి వెళ్లి సెట్ బ్యాక్ తీసుకొని నిర్మించాలని ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆపార్టీ తాజా మాజీ కార్పొరేటర్లు, నాయకులు మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద పనులను అడ్డుకొని, ఆందోళన నిర్వహించారు. వీధి వ్యాపారులైన పేదల దుకాణాలను మునిసిపల్ అధికారులు తొలగించడంపై ఎంఐఎం నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తక్షణమే ఈఅంశాన్ని రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిల దృష్టికి, ఫోన్ ద్వారా ఎంఐఎం నేత గులాం అహ్మద్ తీసుకెళ్లారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ఎంఐఎం నేతలకు నచ్చచెప్పారు. వీధి వ్యాపారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయం జరగనివ్వమని వారికి అండగా ఉంటామని వివరించారు. ఈ సీజన్లో వ్యాపారం చేసుకోవాలని మున్సిపల్ గెస్ట్ హౌస్ గోడను నిర్మాణం చేశాక సైతం ఇక్కడే శాశ్వతంగా వారికి ఉపాధి పొందేందుకు దుకాణాలు ఏర్పాటు చేసుకునేలా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి ఇచ్చిన హామీతో ఎంఐఎం నేతలు ఆందోళన విరమించారు. వీధి వ్యాపారులు నరేందర్ రెడ్డి, గులాం అహ్మద్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ ఈ అంశానికి సంబంధించి ఎన్నోసార్లు అప్పటి ప్రభుత్వ పెద్దలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. అప్పుడు సైతం ఈ వీధి వ్యాపారులకు మద్దతుగా ఆందోళన నిర్వహించిన సంగతిని గుర్తు చేశారు. వీధి వ్యాపారుల పొట్ట కొడితే ఏ ప్రభుత్వంతోనైనా తాము పోరాడేందుకు సిద్ధమన్నారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాల దీన పరిస్థితిని తెలుసుకొని అధికారులు దుకాణాలు తొలగించకుండా ఉంటే బాగుండేది అన్నారు. సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ వీధి వ్యాపారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ట్రాఫిక్ పోలీసుల ఇబ్బందులు ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ ఏసిపి యాదగిరి తో, మున్సిపల్ కమిషనర్ తో, సుడా చైర్మన్ ఫోన్లో మాట్లాడారు ఫుట్ పాత్ వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. దీంతో ఫుట్పాత్ వ్యాపారులలో ఆనందం నెలకొంది. తాము ఎప్పటికీ సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ల మేలు మర్చిపోమని వీధి వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నేతలు బర్కత్ అలీ, ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, నాయకులు అలిబాబా, అజర్, అసదుల్లా బేగ్, సాజిద్, మజారోద్దీన్, తాజుద్దీన్, అబ్దుల్లా అసిమ్, వాజిద్ అలీఖాన్, వ్యాపారులు టిప్పు సుల్తాన్, ఆఫ్రోజ్ శమ్స్, జాకీర్, అల్లు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం

**● ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం ● ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ ను శంకుస్థాపన చేసిన మంత్రి సీతక్క**





**ములుగు జిల్లా,అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేదల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని, ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రం లోని ఎస్. సి. కాలనీ అంగన్వాడీ సెంటర్ సమీపంలో ఒక కోటి యాభై లక్షల రూపాయల నిధులతో ముస్లీం కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇండ్లు ఇచ్చే బాధ్యత నాది అని సీతక్క అన్నారు. పేదల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని పేదల కోసం నిరంతరం పనిచేస్తుందని మంత్రి అన్నారు. ముస్లిం మైనార్టీల కోసం గతంలో ఖబ్రస్తాన్ లకు ప్రహరీ గోడ లను నిధులు ఇచ్చామని మంత్రి అన్నారు. ఇందిరమ్మ మొదటి విడతలో ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ముస్లిం సోదరులకు 140 ఇండ్లు మంజూరి చేసామని రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరి చేస్తామని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా ఏటూరు నాగారం జామ మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ పాషా మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు కమ్యూనిటీ హాల్‌ను మంజూరి చేసినందుకు మంత్రి కి ముస్లిం సోదరుల తరుపున సీతక్కకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్.RTA డైరెక్టర్ వసంత శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు జమ మసీదు కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిఫ్, కోశాధికారి సుజావత్ సర్కార్, సులేమాన్, గీయా, అక్బర్, అబ్దుల్ రావుఫ్, వాజిద్ , చాంద్, ఖలీల్, గౌస్, షరీఫ్ ఖాన్, సలీం, గని , ఖాజా, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కమిటి సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి

● జిల్లాలోని రోడ్ల నిర్వహణపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** క్రొత్తగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేయడంతో పాటు, ఉన్న రోడ్ల మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో రోడ్ల నిర్వహణపై రోడ్లు, భవనాల శాఖ, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఇటీవల వర్షాలకు రహదారులు చాలా చోట్ల దెబ్బతిన్నాయని అన్నారు. దెబ్బతిన్న రోడ్ల గుంతలు, చిన్న చిన్న మరమ్మత్తులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లా ప్రవేశం వద్ద నలువైపులా జిల్లాకు సంబంధించి నామ బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రం ప్రవేశం వద్ద రోడ్లు దెబ్బతిని ఉన్నాయని, నగర పరిధిలోని రోడ్ల నిర్వహణ నగరపాలక సంస్థ చేపడుతుండగా, ప్రారంభం వద్ద సంబంధిత శాఖలు రోడ్ల నిర్వహణ చేయాలని కలెక్టర్ అన్నారు. నగర ప్రవేశం వద్ద గ్రీనరీతో సుందరీకరణ పనులు చేయాలని అన్నారు. జిల్లాలో రోడ్ల విస్తరణ, మరమ్మత్తులు, నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్ వివరాలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అనుమతికి సమర్పించిన ప్రతిపాదనల స్థితిని తెలుసుకొని, అనుమతి పొందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రహదారి భద్రత అధికారులుగా మనపై ఉందని కలెక్టర్ అన్నారు. బైపాస్ బ్రిడ్జి వెడల్పుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అల్లిపురం, వెలుగుమట్ల తదితర ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాల తరలింపు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మంజూరయిన రోడ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసాచారి, నేషనల్ హైవే పిడి రామాంజనేయ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ లు పవార్, తానేశ్వర్, నేషనల్ హైవే ఇఇ యుగంధర్, డిఇ లు, ఏఇ లు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎలక్షన్స్ ప్రచార బాధ్యత సమన్వయకర్త, పరిశీలకుడుగా మొహమ్మద్ తాజోద్దీన్...



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్ బేయ్ ఎలక్షన్స్ లో పరిశిలకుడుగా ప్రచారనికి హై కమండ్ తనపై బాధ్యతగా 103 వ డివిజన్ బోరబండకు నియమించడం జరిగిందనీ, కాంగ్రెస్ మైనారిటీ నేషనల్ చైర్మన్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్ ఘరీ ఆదేశానుసారం కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ నేషనల్ కోర్డనేటర్ తెలంగాణ ఇంచార్జ్ షేకిల్ నవాజ్ నియమించడం జరిగింది, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నీ ఏడు డివిజన్స్ గా విభజించినారు, ఇందులో భాగంగా ఒక డివిజన్ నెంబర్ 103 వ బోరబండ నాయకులతో ప్రచారం చేసే విధంగా ముస్లిం మైనారిటీ లు అధికంగా ఉన్న డివిజన్స్ కు తనకు అక్కడి స్థానిక ముస్లిం నాయకుల సమన్వయకర్త, పరిశీలకుడుగా ప్రచారం బాధ్యత తనకు అప్పగిచడం జరిగిందనీ, తనను నమ్మి తనకు జూబ్లీహిల్స్ ఎలక్షన్స్ ప్రచార బాధ్యత సమన్వయకర్త, పరిశీలకుడుగా నియమించినదుకు ఇమ్రాన్, ప్రతాప్, ఘరీ , ఇంచార్జ్ షేకిల్ నవాజ్, టీపీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్, ల పేరు నిలిచే విధంగా ప్రచారం చేసి తనకు బాధ్యత అప్పగించిన డివిజన్ లొ మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తానని కన్నా తల్లి అయినటువంటి కాంగ్రెస్ పార్టీ మీద ప్రమాణం చేస్తున్నాననీ. మొహమ్మద్ తాజోద్దీన్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ డిపార్ట్మెంట్ కరీంనగర్ తెలిపారు.

# ప్రతి బిడ్డకీ ఆరోగ్యకరమైన హృదయ స్పందన అవసరం

**- ఇండియన్ అసోసియేషన్ పెడియాట్రిక్ అధ్యక్షులు డాక్టర్ కె. ప్రదీప్ కుమార్**

**- విజయవంతంగా ముగిసిన ఉచిత శిశు హృదయ స్క్రీనింగ్ శిబిరం**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** చిన్న పిల్లల్లో గుండె సంబంధిత సమస్యలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అందుకని ఏఐజి హాస్పిటల్స్ బంజారా హిల్స్ హైదరాబాద్ వారి సహకారంతో ఇండియన్ అసోసియేషన్ పెడియాట్రిక్ (ఐఏపి) ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఉచిత శిశుహృదయ (పెడియాట్రిక్ కార్డియాక్) స్క్రీనింగ్ శిబిరం ఐఎంఎ హాల్లో ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. జననానికి సంబంధిత హృదయ సమస్యలు, హృదయ స్పందనలో తేడాలు, హృదయంలో రంధ్రాలు, శ్వాస సమస్యలు, శ్వాసనాళ ఇన్ఫెక్షన్లు ఉన్న పిల్లలు ఏడుస్తున్నప్పుడు చర్మం నీలిరంగు అవడం వంటివి పై ఉచిత 2D ఏకోకో స్క్రీనింగ్ చేయించుకోవడానికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పుట్టినప్పుడు తీవ్రమైన గుండె సమస్యలు ఉన్న శిశువులకు వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవడం అలాగే గతంలో శస్త్రచికిత్స జరిగిన పిల్లలకు అవసరమైన సలహా సూచనలు అందించారు. ప్రతి బిడ్డకీ ఆరోగ్యకరమైన హృదయ స్పందన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి అండ్ సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ చిన్నస్వామి రెడ్డి, కన్సల్టెంట్ పీడియాట్రిక్ కార్డియాక్ డాక్టర్ దసన్న లింగస్వామి, ఇండియన్ అసోసియేషన్ పెడియాట్రిక్ అధ్యక్షులు డాక్టర్ కె. ప్రదీప్ కుమార్, సెక్రెటరీ డాక్టర్ ఎ. భారత కుమార్, ట్రెజరర్ డాక్టర్ సాయిభార్గవ లు పాల్గొన్నారు.




# టీజీపీఎస్సీ గ్రూప్ 1 సర్వీసెస్‌లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌గా ఎంపికైన శగుఫ్తా ఫిర్దౌస్

● హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన !

● యునైటెడ్ తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఫర్ మైనారిటీస్



**కరీంనగర్ టౌన్ అక్టోబర్ 15(పిసిడబ్ల్యూ న్యూస్):** శగుఫ్తా ఫిర్దౌస్ ని టీజీపీఎస్సీ గ్రూప్ 1 సర్వీసెస్ లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్‌గా ఎంపికై కరీంనగర్ జిల్లాకు నియమించినందుకు హృదయపూర్వకంగా అభినందిస్తుంది. మీ విజయము కృషి, ప్రతిభ, మరియు శక్తివంతమైన స్ఫూర్తికి అద్దం పడినదిగా నిలిచింది. ఈ గౌరవనీయమైన సాధనతో మీరు మైనారిటీ ఉద్యోగుల సమాజానికి మరియు మీ స్వంత ఊరు కాగజ్ నగర్ కి గర్వకారణమయ్యారు! మీ ప్రయాణం ఇంకా ఎన్నోమందికి ప్రేరణగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము హృదయపూర్వక శుభాకాంక్షలతో, షేక్ నిసార్ అహ్మద్ యునైటెడ్ టీమ్ రాష్ట్ర అధ్యక్షులు బషీర్ హుస్సేన్, మొహమ్మద్ జావీద్, ఆయేషా ముమ్తాజ్, షారుఖ్ ఖాన్, ముజీబ్ అయ్యూబ్, ఎహ్తేశాం ఉల్ హక్ సామాజిక కార్యకర్తలు మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# బాణసంచా దుకాణాల వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

● అనుమతి లేకుండా బాణసంచా నిల్వచేసినా, తయారుచేసినా కఠిన చర్యలు

● అడిషనల్ డీసీపీ లా అండ్ అర్డర్ ప్రసాద్ రావు

● డిగ్రీ కళాశాలలో 86, పెవిలియన్ మైదానంలో 42 బాణసంచా దుకాణాల ఏర్పాటు







**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటుచేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అడిషనల్ డీసీపీ లా అండ్ అర్డర్ ప్రసాద్ రావు అన్నారు. బాణసంచా దుకాణాల కేటాయింపునకు బుధవారం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లాటరీ పద్దతిలో డ్రా తీసి ఒకొక్కరికి దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. నిబంధనల మేరకు నగరంలోని రెండు మైదానాల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు జిల్లా అధికారులు అనుమతిచ్చారని, వీటిని ఎవరు అతిక్రమించవద్దని అన్నారు. డిగ్రీ కళాశాలలో 86, పెవిలియన్ మైదానంలో 42 ఏర్పాటు చేయాలని నిర్ణయించి డ్రా తీసినట్లు తెలిపారు. మొత్తం 148 మంది దరఖాస్తుదారుల్లో 128 దీపావళి బాణసంచా దుకాణాలు కేటాయించిన్నట్లు తెలిపారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా నగర పరిధిలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. బాణసంచా దుకాణదారులు బకెట్‌లలో ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఎవరైన బాణసంచా దుకాణాలు నడుపుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. బాణసంచా దుకాణాల ముసుగులో ఎవరూ కూడా డబ్బులు వసూళ్ళు చేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అదేవిధంగా దుకాణదారులు ఎవరికి డబ్బులు ఇవ్వకూడదని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ రమణమూర్తి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

# పరామర్శ



**చిట్యాల అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన (అజ్మీరా నందనాయక్) మృతి చెందగా వారి పార్థివ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపిన చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగాధర మోడల్ స్కూల్ విద్యార్థిని కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయిలో అవార్డు




**గంగాధర, అక్టోబర్ 15 (పిసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని గంగాధర మోడల్ స్కూల్ లో ఇటీవల పెద్దపెల్లి లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి SGF under/14 girls కబడ్డీ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గంగాధర మోడల్ స్కూల్ విద్యార్థిని వాత్సల్య ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మ మరియు వ్యాయామ ఉపాధ్యాయుడు నాగార్జున తెలిపారు.

## ఇంటింటా ఉపాధి హామీ పనులపై సర్వే



**దంతాలపల్లి అక్టోబర్ 15 (పిసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని 17 గ్రామపంచాయతీలలో బుధవారం నుంచి సామాజికత నికిలో భాగంగా ఇంటింటా జాతీయ ఉపాధి హామీపై సర్వే నిర్వహిస్తున్నారుఎంపీవో మహమ్మద్ అప్సర పాషా మాట్లాడుతూ 16 నుంచి 22 వరకు వివిధ గ్రామ పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేస్తామన్నారు 23న మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ పై ఓపెన్ ఫోరం ఏర్పాటు చేస్తామన్నారు.

# పుణ్యక్షేత్రాలుకు ప్రత్యేక బస్సులు

**- ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్**

**- కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచారామాలకు బస్సులు**

**- ప్రతి ఆదివారం సాయంత్రం 8 గంటలకు బస్ బయలుదేరేలా ఏర్పాట్లు**

**- అన్నవరానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసిన ఆర్ఎం**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోరిక మేరకు పుణ్యక్షేత్రాలుకు బస్సులు నడుపుటకు ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆసక్తి చూపారు. దానిలోని భాగంగా ఖమ్మం రీజినల్ మేనేజర్ ఆఫీస్ కార్యాలయం నందు రీజియన్ లో ఉన్న ఏడు డిపో మేనేజర్లు, సూపర్వైజర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అలానే కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలైన అన్నవరం, పంచారామాలకు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ ప్రెస్ సర్వీసులను కార్తీక మాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 8 గంటలకు జిల్లాలోని అన్ని బస్ స్టేషన్ నుండి బయలుదేరేలా అన్ని ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లకు సూపర్వైజర్ కు ఆదేశాలు ఇస్తూ పంచారామాలు, అన్నవరానికి సంబంధించిన పోస్టర్ను రీజనల్ మేనేజర్ కార్యాలయం నందు రీజనల్ మేనేజర్ సరిరామ్ చేతుల మీదుగా ప్రారంభించారు. **బస్ ప్రయాణం చార్జీలు :** పంచారామాలు వెళ్ళుటకు పెద్దలకు రూ.2300, పిల్లలకు రూ. 1200, అన్నవరం వెళుటకు పెద్దలకు రూ.750, పిల్లలకు 420 రూపాయలు మాత్రమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ సంపత్, అన్ని డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదల చేయాలి










**- జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య**

**- పెన్షనర్ల భారీ ప్రదర్శన - నిరసన ధర్నా**

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్):** 30 సంవత్సరములు పైగా ప్రభుత్వ సర్వీసులో సేవలు అందించి రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ న్యాయబద్ధంగా రావలసిన ప్రయోజనాలను బకాయిలను విడుదల చేయకుండా వారిని తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరసిస్తూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ప్రదర్శన, నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా శిబిరాన్ని ప్రారంభిస్తూ జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య మాట్లాడుతూ... గత 18 నెలలుగా రిటైర్ అయిన ఉద్యోగుల జిపిఎఫ్ గ్రాచుటీ కమ్యూ టేషన్ సరెండర్ లీవ్ తదితర ఆర్థిక బకాయిలను విడుదల చేయకపోవడంతో జిల్లాలో కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన చెంది మరణించారన్నారు. వారి మరణానికి బాధ్యులు ఎవరని ఆయన ప్రశ్నించారు..? 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షనరీ ప్రయోజనాలు రాకపోవటంతో ఆవేదన చెంది జీవితాలను చాలిస్తున్నారన్నారు.. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుబ్బయ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి బకాయిల చెల్లింపు కోసం ఏడు వందల కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి మాట నిలుపుకోలేదని దానితో అనేక చెల్లింపులు నిలిచిపోవడంతో వేలాదిమంది రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక మానసిక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని ఖమ్మం నగరానికి మార్చాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన చర్యలు తీసుకోకపోవడంతో ఖమ్మం నగరం నుండి పెన్షనర్లు సబ్ ట్రెజరీ కార్యాలయానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆసుపత్రిలోని వెల్నెస్ సెంటర్లో మందులన్నీ లభించడం లేదని అన్ని రకాల పరీక్షలు నిర్వహించడం లేదని దీనితో ఎంతోమంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించవలసి వస్తుందని జిల్లా కలెక్టర్, మంత్రివర్యులు జోక్యం చేసుకొని వెల్నెస్ సెంటర్ను ఆధునికరించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం గౌరవంగా జీవించే హక్కును పెన్షనర్లకు కల్పించాలని, అదేవిధంగా సీనియర్ సిటిజన్స్ గౌరవంగా జీవించే హక్కును కాలరాయొద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మానవ హక్కుల కమిషన్ 2007 ప్రకారం వృద్ధుల హక్కులను పరిరక్షించాలని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల హక్కులను కాపాడాలని అన్నారు. పంచాయతీ రాజ్ మాజీ సంఘ నాయకులు వెంకటపతి రాజు మాట్లాడుతూ... రిటైర్డ్ ఉద్యోగుల హక్కులను ప్రభుత్వం ఉల్లంఘించవద్దని, వారికి ధర్మబద్ధంగా రావలసిన ప్రయోజనాలను వెంటనే కల్పించాలని తెలిపారు. సీనియర్ నాయకులు ఎన్ కృష్ణమోహన్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఇవ్వవలసిన ఐదు డిఏలను, పిఆర్సి ప్రయోజనాలను కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంపై ఉద్యోగ పెన్షనర్లకు ఉన్న వ్యతిరేకతతోనే నేడున్న ప్రభుత్వాన్ని బలపరిచామని, ఈ విషయం గుర్తుంచుకొని ఉద్యోగస్తులను, పెన్షనర్లను ఇబ్బందులకు గురి చేయవద్దని పేర్కొన్నారు. ధర్నా శిబిరం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం పెన్షనర్లు ప్లకార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎస్ టి ఓ కార్యాలయాన్ని ఖమ్మం నగరానికి మార్చాలని, వెల్నెస్ సెంటర్ను ఆధునికరించాలని, జిల్లా మెడికల్ బోర్డులో గల సమస్యలు పరిష్కరించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, 5 పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, పిఆర్సి ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనగా వెళ్లి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సత్తుపల్లి, కల్లూరు, వైరా, పెనుబల్లి, ఏనుకూరు, తల్లాడ, మధిర, కూసుమంచి, నేలకొండపల్లి తదితర మండలాల నుండి వందలాది మంది పెన్షనర్లు ఈ ప్రదర్శన ధర్నాలో పాల్గొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. దుర్గాదేవి ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను పాట రూపంలో వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, కార్యదర్శి ఎం సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తాళ్లూరు వేణు, ఉపాధ్యక్షులు టి జనార్ధన్, ఆర్థిక కార్యదర్శి డీకే శర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి సాంబశివరావు, వై కాజా మొయినుద్దీన్, పి రాజారావు, కూతురు కృష్ణమూర్తి, చెల్లి బాబురావు, రాయల వెంకటనారాయణ, బసవరావ్, యు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, హనుమంతరావు, రమేష్, రమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రభుత్వ లక్ష్యం..

**శాసనసభ్యులు వైద్యులు భూక్య మురళి నాయక్**

**మహబూబాబాద్ అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కోతలు లేని నాణ్యమైన విద్యుత్ ను అందించడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు వైద్యులు భూక్య మురళి నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని తన సొంత గ్రామం సోమల తండాలో పర్యటించారు. శాసనసభ్యులు తండా వాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారితో సుఖ సంతోషాలను పంచుకున్నారు. పర్వతగిరి గ్రామంలో పర్యటించి నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం విద్యుత్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో స్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్ స్తంభాలను శంకుస్థాపన చేశారు. అలాగే తండలో నూతన స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తు లైనులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ.. నాణ్యమైన, కోతలు లేని విద్యుత్ ను అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు, నిరుపేదలకు లాభసాటిగా ఉండే పథకాలను కొనసాగిస్తూనే, విద్యుత్ రంగాన్ని పునరుద్ధరించే ప్రజా ప్రభుత్వంప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఆరు గ్యారంటీలలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం గృహ జ్యోతి పథకాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసింది. 200 యూనిట్లు లోపు, విద్యుత్ వాడే వినియోగదారులకు విద్యుత్ ను అందిస్తుందని తెలిపారు. విద్యుత్



ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలని కోరారు. వ్యవసాయ పొలాల దగ్గర స్టార్టర్ లకు మోటార్ ఎర్తింగ్ చేసుకోవాలని, అలాగే ఇంటి దగ్గర కూడా ఎర్తింగ్ చేసుకోవాలని తెలిపారు. దుస్తువులు ఆరవేయడానికి ఐరన్ వైర్ వాడకూడదని చెప్పారు. పర్వతగిరి గ్రామంలోనీ రైతులకి ఉన్నటువంటి విద్యుత్ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేలా విద్యుత్ ఏఈ కి సూచనలు చేశారు. వర్షాకాలంలో చెట్లు విరిగి విద్యుత్ లైన్ ల మీద పడడం, లైన్ తెగి కింద పడిపోయినప్పుడు వెంటనే రైతులు తమ లైన్మెన్ లేదా AEకి సమాచారం అందించాలని సూచించారు . విద్యుత్ ప్రమాదాల సమయం లో విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ఉపయోగించుకోవాలని తెలిపారు. మహబూబాబాద్ సెక్షన్ లో పనిచేస్తున్న ఇంజనీర్లకు, విద్యుత్ సిబ్బందికి విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.



# అగ్రవర్ణాల కుట్రలను సహించం...
# ఇక బీసీ సమాజం మోసపోదు

**రాబోయే మూడేళ్లలో బీసీలదే రాజ్యాధికారం**

**టిఆర్పి అధ్యక్షుడు , ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పష్టం**

**వందమందికి పైగా పార్టీలో చేరిన సభ్యులు**






**షాద్ నగర్, అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** షాద్‌నగర్ పట్టణంలో బీసీ ఐక్యతా స్ఫూర్తి మరింత బలపడుతోంది. టిఆర్పి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల చైతన్యమే భవిష్యత్తు రాజకీయ దిశను నిర్ణయిస్తుందని అన్నారు.బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని హెూటల్ గోదావరి సమీపంలో నిర్వహించిన బీసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీసీ మహాసభ రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షుడు శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో వందమందికి పైగా కొత్త సభ్యులు టిఆర్పి పార్టీలో చేరారు.మల్లన్న వారిని కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం మాట్లాడుతూ మల్లన్న మాట్లాడుతూ....బీసీల ఆత్మగౌరవం, రిజర్వేషన్లు, రాజ్యాధికారం కోసం పోరాడే పార్టీగా టిఆర్పి రూపొందింది.78 ఏళ్ల పరిపాలనలో బీసీలు రాజాధికారానికి దూరంగా ఉంచబడ్డారు. కానీ ఇక పరిస్థితులు మారాయి. గ్రామ స్థాయిలోనుంచి రాష్ట్ర స్థాయివరకు బీసీలు చైతన్యవంతంగా ఐక్యమవుతున్నారు.రాబోయే మూడేళ్లలో తెలంగాణలో బీసీలదే రాజ్యాధికారం స్పష్టం చేశారు. తాను నేతృత్వం వహిస్తున్న టిఆర్పి పార్టీ బీసీల హక్కుల కోసం కడపటి దాకా పోరాడుతుందని మల్లన్న స్పష్టం చేశారు.బడుగు బలహీన ప్రజల హక్కుల కోసం నిలబడుతుంది. ఈ పోరాటం కేవలం రాజకీయమే కాదు. సామాజిక సమానత్వం కోసం కూడా అని ఆయన తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ వైపు బీసీలు మొగ్గు చూపుతున్నారని , 78 ఏళ్లకాలంలో అగ్రవర్ణ కులాల బిసి సమాజాన్ని మోసం చేస్తున్న తీరును పసిగట్టారని, చరిత్రలో వివిధ పార్టీల జెండాలు మోసం ,కానీ ప్రస్తుతం బీసీ ల జెండాలు మోస్తున్నాం. రాబోయే మూడేళ్ల కాలంలో ముఖ్యమంత్రి సీటు అధిరోహించి అసెంబ్లీ, మండలి, కార్పొరేషన్ సీట్లు సాధించి పదిలం చేసుకుంటామని, అగ్రవర్ణ కులాలు తమపై కుట్రలు కుతంత్రాలు చేస్తే, బిసిల హక్కులు కాలరాస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. శ్రీధర్ వర్మ మాట్లాడుతూ... బీసీల చైతన్యం కోసం గ్రామ గ్రామాలలో కార్యచరణ రూపొందించి, రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతామ న్నారు. టిఆర్పి నాయకులు నీరాటి ఆంజనేయులు, గుడాల గిరిబాబు , జనార్దన్, రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ, సోలిపేట శంకర్ ముదిరాజ్, నర్సింలు, గణేష్, యాదగిరి, రవి, శేఖర్,కూతలి వేణుగోపాల్, రామచందర్, కె.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఆదుకున్నవారే
# నిజమైన ఆప్తులు

**- ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు సామల కోటేశ్వరరావు**

**- ఫోటో గ్రాఫర్ (రిపోర్టర్) పల్లెపొంగు ఉపేందర్ కు ఆర్థికసాయం**

**- 16వేలు ఆర్థిక సాయం అందించిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు**



**ఖమ్మం అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఆదుకున్నవారే నిజమైన ఆప్తులని ముదిగొండ మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామల కోటేశ్వరరావు అన్నారు. ముదిగొండ మండలానికి చెందిన ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యుడు న్యూ లక్ష్మీపురం పల్లెపొంగు ఉపేందర్ ఆరోగ్య సమస్యల కారణంగా (షుగర్ సమస్య) తన వృత్తిని కొనసాగించలేకపోతున్నారు. మానవత్వంతో ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ సభ్యులు మంచి ఆలోచన చేసి ఉపేందర్ కు 16వేల రూపాయలను ముదిగొండ మండల ఫోటోలు అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ తరపున అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. సాయం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆపదలో ఆదుకున్నందుకు మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేనని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా నాయకులు, ఖమ్మం టౌన్ సీనియర్ ఫోటోగ్రాఫర్స్, అలాగే ముదిగొండ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ మిత్రులు కోశాధికారి మేకపోతుల చందు, ఉపాధ్యక్షులు తలారి కాంతారావు, తలారి ప్రకాష్, గౌరవ సలహాదారుడు షేక్ సైదులు, తోటి ఫోటోగ్రాఫర్ అశోక్ పొడుగు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

**యాదాద్రి అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో బుధవారం రోజున నిర్వహించిన పోషణ మాసం సరైన పోషణతో ఆరోగ్యవంతమైన మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసి శ్రీమంతం మరియు అన్న ప్రసన్న కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి

**- ప్రపంచ విద్యార్థుల దినోత్సవం**

**నర్సింహులపేట అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నర్సింహులపేట మండలం లోని పడమటి గూడెం గ్రామంలోని ఎంపీయుపిఎస్ పాఠశాలలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవంను బుధవారం ప్రధానోపాధ్యాయులు ఎర్ర పూర్ణచందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఇ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ రామ్మోహన్ రావు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు పూర్ణచందర్ ఆర్థిక సహకారంతో టై,బెల్టులు,ఐడి కార్డ్స్ అందజే శారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ డాక్టర్.అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా జరుపుకోవడం మన అందరికీ గర్వకారణం అన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్,శేఖర్, మురళి,వెంకన్న,తిరుపతయ్య,సీ ఆర్పీ రవి పాల్గొన్నారు.

## పత్తి పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారులు




**దంతాలపల్లి అక్టోబర్ 15 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండలంలోని లక్ష్మీపురం రేపుని గ్రామాల్లో బుధవారం పత్తి పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వాహిని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న కిసాన్ కెపాసి యాప్ ద్వారా రైతులు సులభంగా తమ పత్తిని విక్రయం చేసుకోవచ్చన్నారు. మండలంలోని రైతులందరూ కూడా ఈ యాప్ ద్వారా తమ పత్తి పంటను సమీప కొనుగోలు కేంద్రానికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లు దీక్షిత్ కుమార్ ఉదయ్ కిరణ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# టీమ్ఇండియాకు కలిసొస్తుందా...?



మహిళల ప్రపంచకప్ 2025లో శ్రీలంక-న్యూజిలాండ్ మధ్య మంగళవారం జరిగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. శ్రీలంక ఇన్నింగ్స్ ముగిసిన వెంటనే వర్షం కురవడంతో న్యూజిలాండ్ బ్యాటింగ్ చేయలేకపోయింది. దీంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటన చేశారు. ఇక ఇరు జట్లు తలా ఒక పాయింట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు 6 వికెట్ల నష్టానికి 258 పరుగుల గౌరవప్రదమైన స్కోర్ సాధించింది. అయితే లంక ఇన్నింగ్స్ అనంతరం న్యూజిలాండ్ ఛేజింగ్ ప్రారంభించేలోపే స్టేడియంలో మళ్లీ వర్షం కురవడంతో మ్యాచ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో మ్యాచ్ క్యాన్సిల్ అయ్యింది. ఇక ఈ మ్యాచ్ రద్దవడంతో శ్రీలంక 2 పాయింట్లతో పట్టికలో ఏడో స్థానంలో ఉంది. ఇప్పటిదాకా శ్రీలంక గెలుపు నమోదు చేయలేదు. నాలుగు మ్యాచ్‌ల్లో రెండు ఓడగా, ఇంకా రెండు మ్యాచ్‌లు రద్దు అయ్యాయి. మరోవైపు న్యూజిలాండ్ 3 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. అయితే ఈ మ్యాచ్ రద్దు అవ్వడం ఈ రెండు జట్లకు భారీ దెబ్బకొట్టినట్లైంది.అయితే టోర్నీలో ప్రస్తుతం భారత్- కివీస్ మధ్య సెమీస్ రేసు రసవత్తరంగా ఉంది. తాజాగా మ్యాచ్ క్యాన్సిల్ అవ్వడంతో శ్రీలంకకు సెమీఫైనల్ అవకాశాలు కష్టమయ్యాయి. మరోవైపు కివీస్ కూడా సెమీస్ ఛాన్స్‌లు సంక్లిష్టం చేసుకుంది. ఇది భారత్‌కు ఒక రకంగా మంచి అవకాశం. టీమ్ఇండియా తమ తదుపరి మ్యాచ్‌ల్లో అన్నింట్లో నెగ్గితే 10 పాయింట్లు వస్తాయి. ఒకవేళ కివీస్ ఇకపై ఆడే 3 మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే 9 పాయింట్లే అవుతాయి. ఇక్కడ మరో ఇంట్రెస్టింగ్ ఏటంటే భారత్- కివీస్ మధ్య కూడా ఒక మ్యాచ్ ఉంది. ఈ మ్యాచ్‌లో నెగ్గిన వాళ్లకు సెమీ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి.ఈ మ్యాచ్‌లో శ్రీలంక బ్యాటింగ్ ఎంచుకొని నిలక్షి డి సిల్వా (55 పరుగులు నాటౌట్, 28 బంతుల్లో) మెరుపులు మెరిపించింది. కేవలం 26 బంతుల్లోనే 50 పరుగులు మార్క్ అందుకుంది. ఈ క్రమంలో వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో వేగవంతమైన అర్ధశతకం సాధించింది. ఇందులో 7 ఫోర్లు, ఒక సిక్స్ ఉన్నాయి. కెప్టెన్ చమరి అటపట్టు (53 పరుగులు) అర్ధశతకం సాధించింది. దీంతో 6 వికెట్లకు లంక 258 పరుగులు చేసింది. కెప్టెన్ అటపట్టు, యువ బ్యాటర్ విశ్మీ గుణరత్నె (42)తో కలిసి 101 పరుగుల భాగస్వామ్యం నిర్మించింది. హసిని పెరెరా కూడా 44 పరుగులతో జట్టుకు మద్దతు ఇచ్చింది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే అటాపట్టు అద్భుతమైన కవర్ డ్రైవ్‌తో ప్రారంభించి తన ధోరణి స్పష్టంచేసింది. తొలి విజయానికై ఎదురుచూస్తున్న శ్రీలంక టాప్‌ఆర్డర్‌లో వ్యూహాత్మక మార్పు చేసింది. 20 ఏళ్ల గుణరత్నెను కెప్టెన్‌తో కలిసి ఓపెనింగ్‌కు పంపింది, ఆ నిర్ణయం విజయవంతమైంది.

# విరాట్ స్టైల్‌కు అభిమానులు ఫిదా



భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా వన్డే సిరీస్ ప్రారంభానికి వారం రోజుల కంటే తక్కువ సమయం ఉంది. అంతకుముందు, విరాట్ కోహ్లీ భారతదేశానికి తిరిగి వచ్చాడు, ఇక్కడి నుంచి అతను ఇతర భారత ఆటగాళ్లతో కలిసి ఆస్ట్రేలియాకు వెళ్తాడు. కింగ్ కోహ్లీని మంగళవారం నాడు న్యూఢిల్లీ విమానాశ్రయంలో చూశారు, అక్కడ అతనిని ఘనంగా స్వాగతించారు. విమానాశ్రయంలో విరాట్ నల్లటి చొక్కా, తెలుపు ప్యాంటులో కనిపించాడు, అతని ఈ లుక్ ఫోటో బాగా వైరల్ అవుతోంది. విరాట్ కోహ్లీ న్యూఢిల్లీ విమానాశ్రయంలో కనిపించగానే అభిమానులు ఎగబడ్డారు. అందుకే అతని నల్ల చొక్కా, తెలుపు ప్యాంటు ఫోటోను ఫ్యాన్స్ షేర్ చేస్తున్నారు. %ఖూా% 2025 ముగిసిన తర్వాత విరాట్ కోహ్లీ తన పిల్లలు, భార్యతో కలిసి లండన్ వెళ్లారు. ఇప్పుడు ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లేందుకు టీంతో కలిసేందుకు లండన్ నుంచి వచ్చారు. అతను గత సంవత్సరం %ట%20 ఫార్మాట్ నుంచి,టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. నివేదిక ప్రకారం, భారత జట్టు 2 వేర్వేరు ఫార్మాట్‌లలో ఆస్ట్రేలియాకు బయలుదేరుతుంది. కొంతమంది ఆటగాళ్ళు ఉదయం, మిగిలిన ఆటగాళ్ళు సాయంత్రం టిక్కెట్లు దొరికాయి. వారు వేర్వరు టైంలలో ఆస్ట్రేలియా విమానాన్ని పట్టుకుంటారని చెప్పారు. టీమ్ ఇండియా ఇక్కడి నుంచి నేరుగా పెర్త్ వెళ్తుంది, అక్కడ అక్టోబర్ 19న భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మొదటి వన్డే మ్యాచ్ జరగనుంది.రిటైర్మెంట్ ఊహాగానాల మధ్య, విరాట్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 తర్వాత మొదటిసారిగా వన్డే మ్యాచ్ ఆడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆస్ట్రేలియా పర్యటన కోసం భారత జట్టును ప్రకటించినప్పుడు, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే ప్రపంచ కప్ 2027లో ఆడటంపై ఎటువంటి స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు.ఈ వన్డే సిరీస్‌కు శుభ్‌మన్‌గిల్ భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. చాలా కాలం తర్వాత రోహిత్ శర్మ ఈ వన్డే సిరీస్‌లో బ్యాట్స్‌మెన్‌గా కనిపిస్తాడు. గిల్ వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం ఇదే మొదటిసారి. ఇటువంటి పరిస్థితిలో 2027 ప్రపంచ కప్ కోసం విరాట్- రోహిత్ పట్ల చీఫ్ సెలెక్టర్ల వైఖరి ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల కెరీర్‌కు మంచి సంకేతం కాదని విశ్లేషకులు అంటున్నారు.



# ఎంపికలో సమూల మార్పులు చేయాలి

- ఆటగాళ్లు సెలక్టర్లకు అస్సలు భయపడకూడదు
- టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే



టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ అజింక్యా రహానే సెలక్షన్ కమిటీలో నియామకాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డొమెస్టిక్ క్రికెట్ సెలక్టర్ల ఎంపికలో పాత పద్ధతులతో కాకుండా, సమూల మార్పులు చేసి కొత్త విధానాలు అనుసరించాల్సి ఉందని అన్నాడు. అలాగే యువ ఆటగాళ్లు సెలక్టర్లకు అస్సలు భయపడకూడదని చెప్పాడు. రీసెంట్‌గా తన యూట్యూబ్ ఛానెల్‌లో ఛతేశ్వర్ పుజారాతో రహానే చిట్‌చాట్ నిర్వహించాడు. ఈ క్రమంలోనే రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. ప్రస్తుతం సెలక్షన్ కమిటీలో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలంటే సదరు వ్యక్తి కనీసం 10 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉండి, క్రికెట్ నుంచి రిటైరై ఐదు సంవత్సరాలు దాటాలి. ఇదీ ప్రస్తుత నిబంధన. అలా అయితేనే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ లెక్కన ఛతేశ్వర్ పుజారా రీసెంట్‌గానే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పాడు. అతడు సెలక్షన్ కమిటీలో దరఖాస్తూ చేసుకోవాలంటే 2030 దాకా ఆగాల్సిందే! అయితే ఇలా కాకుండా రీసెంట్‌గా రిటైరైన క్రికెటర్లే సెలక్షన్ కమిటీలో ఉండాలని అభిప్రాయపడ్డాడు. 'ఆటగాళ్లు సెలక్టర్లకు భయపడకూడదు. నేను ముఖ్యంగా దేశవాళీ క్రికెట్‌లో సెలక్షన్ కమిటీ నియామకం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. సెలక్షన్ కమిటీ నియామకంలో మార్పులు జరగాలి. కెరీర్‌లో అత్యుత్తమ స్థాయిలో క్రికెట్ ఆడి ఇటీవల రిటైర్ అయినా వాళ్లను సెలక్టర్లుగా నియమించాలి. అంతేకాని ఎప్పుడో 7- 8ఏళ్ల కిందట రిటైర్ అయిన వాళ్లను సెలక్టర్లుగా ఎంపిక చేస్తే ఎలా. అలా ఎంపిక చేయొద్దు. ఎందుకంటే క్రికెట్‌లో ఎప్పటికప్పుడు చాలా మార్పులు వస్తున్నాయి' 'అందుకు అనుగుణంగా సెలక్టర్ల మైండ్ సెట్ మారాల్సిన అవసరం ఉంది. 20- 30ఏళ్ల కిందట క్రికెట్ ఎలా ఆడారు అన్న విధానాలతో నిర్ణయాలు తీసుకునేవారు వద్దు. టీ20, ఐపీఎల్ వంటి ఫార్మాట్లతో కొత్త తరం ఆడుతున్న మోడ్రన్ స్టైల్ క్రికెట్‌ను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సెలక్షన్ కమిటీలో దాదాపు అన్ని రాష్ట్రాల వాళ్లు ఉండేలా చూడాలి. అప్పుడే ఆటగాళ్లు స్వేచ్ఛగా, ధైర్యంగా క్రికెట్ ఆడగలరు' అని రహానే అన్నాడు. దీనికి పుజారా కూడా రహానే అభిప్రాయంతో ఏకీభవించాడు.

# భారత్-పాక్ మధ్య ముగిసిన హ్యాండ్‌షేక్ వివాదం



ఇటీవల ముగిసిన ఆసియా కప్ 2025 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య నెలకొన్న నో హ్యాండ్‌షేక్ వివాదం యావత్ క్రీడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. పుల్వామా ఉగ్రదాడి తర్వాత భారత క్రికెటర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ పాకిస్థాన్ ఆటగాళ్లతో, అధికారులతో షేక్ హ్యాండ్ చేయకుండా తమ వైఖరిని కొనసాగించారు. అయితే, మలేషియాలో అక్టోబర్ 14న జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ 2025 హాకీ మ్యాచ్‌లో మాత్రం పరిస్థితి మారింది. భారత్ %ఖ%-21 జట్టు, పాకిస్థాన్ జూనియర్ హాకీ ప్లేయర్స్‌తో మ్యాచ్‌కు ముందు హ్యాండ్‌షేక్ ఇవ్వడం, హై-ఫైవ్ ఇవ్వడం జరిగింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మలేషియాలో జరిగిన సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్ హాకీ మ్యాచ్ ప్రారంభం కావడానికి ముందు భారత్, పాకిస్థాన్ ఆటగాళ్లు ఒకరికొకరు హై-ఫైవ్ ఇచ్చుకున్నారు. ఈ సంఘటన హ్యాండ్‌షేక్ వివాదానికి ముగింపు పలికినట్లు క్రీడాభిమానులు భావిస్తున్నారు. వాస్తవానికి, ఈ మ్యాచ్ కంటే ముందే, పాకిస్థాన్ హాకీ సమాఖ్య తమ జూనియర్ జట్టుకు నో-హ్యాండ్‌షేక్ పరిస్థితికి సిద్ధంగా ఉండాలని, భారత జట్టు హ్యాండ్‌షేక్ ఇవ్వడానికి నిరాకరిస్తే, దానిని పట్టించుకోవద్దని, భారత ఆటగాళ్లతో భావోద్వేగంగా ఎలాంటి వాదనకు లేదా ఘర్షణకు దిగొద్దని ఆదేశాలు జారీ చేసింది. గతంలో పాకిస్థాన్ హాకీ జట్టు భారత్‌కు ఆడటానికి రాలేదు. ఆ సమయంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు అధికంగా ఉండేవి.ఈ వివాదం సరిగ్గా సెప్టెంబర్ 14న జరిగిన ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్‌తో మొదలైంది. పుల్వామా ఉగ్రదాడి జరిగిన తర్వాత భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా భారత జట్టు నో హ్యాండ్‌షేక్ విధానాన్ని అమలు చేసింది. ఆ మ్యాచ్‌కు ముందు టాస్ సమయంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాక్ కెప్టెన్ సల్మాన్ అఘాతో హ్యాండ్‌షేక్ ఇవ్వడానికి నిరాకరించాడు.తొలి మ్యాచ్‌లో మాత్రమే కాకుండా, సూపర్-4, ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లలో కూడా భారత క్రికెట్ జట్టు ఇదే నో హ్యాండ్‌షేక్ విధానాన్ని కొనసాగించింది. మ్యాచ్‌లు గెలిచిన తర్వాత కూడా భారత ఆటగాళ్లు పాక్ టీమ్‌తో షేక్ హ్యాండ్ చేయకుండానే నేరుగా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చింది. ఫైనల్ గెలిచిన తరువాత భారత జట్టు ఏసీసీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి కూడా నిరాకరించింది. ఫలితంగా నఖ్వీ ట్రోఫీని తమతో తీసుకెళ్లారు. ఆ ట్రోఫీ ఇప్పటికీ భారత జట్టుకు అందలేదని సమాచారం. ఈ వివాదం మహిళల వన్డే ప్రపంచకప్‌లోనూ కొనసాగింది.



# కోహ్లీ, రోహిత్‌తోపాటు జర్నీ చేయని గంభీర్

భారత క్రికెట్ అభిమానుల ఎదురుచూపులు ఫలించాయి. ఆస్ట్రేలియాతో జరగబోయే ముఖ్యమైన మూడు వన్డేల సిరీస్ కోసం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో కూడిన టీమిండియా తొలి బ్యాచ్ ఆటగాళ్లు ఆసీస్‌కు బయలుదేరారు. అయితే, ఈ తొలి బృందంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ లేకపోవడం విశేషం.సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో సహా మొదటి బ్యాచ్ ఆటగాళ్లు బుధవారం (అక్టోబర్ 15, 2025) ఉదయం ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు పయనమయ్యారు. జట్టు సభ్యులు: విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కొత్త వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి, పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ ఈ తొలి బృందంలో ఉన్నారు. ఆటగాళ్లతో పాటు కొంతమంది సపోర్ట్ స్టాఫ్ కూడా ఆస్ట్రేలియా వెళ్లారు. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కోచింగ్ సిబ్బందిలోని మరికొంతమంది సభ్యులు మాత్రం బుధవారం సాయంత్రం తర్వాత ఆస్ట్రేలియాకు బయలుదేరనున్నారు.ఈ సిరీస్‌కు ముందు, టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ టెస్టు సిరీస్ మంగళవారం (అక్టోబర్ 14) ముగియడంతో, అందులో పాల్గొన్న ఆటగాళ్లు ఆ తరువాత రోజు ప్రయాణానికి సిద్ధమయ్యారు. గంభీర్ కూడా వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌లో జట్టుతో ఉన్నారు.టెస్టులు, టీ20ల నుంచి వైదొలిగిన తర్వాత, వన్డే ఫార్మాట్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పునరాగమనం చేస్తుండటం పట్ల ఈ సిరీస్‌పై మరింత ఆసక్తి నెలకొంది. వీరు చివరిసారిగా ఈ ఏడాది మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే మ్యాచ్ ఆడారు.ఆస్ట్రేలియా సిరీస్‌లో వారి అనుభవం జట్టుకు చాలా విలువైనదని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ విజయం తర్వాత జరిగిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. అయితే, 2027 వన్డే ప్రపంచకప్ భవితవ్యంపై మాత్రం ఆయన స్పష్టత ఇవ్వకుండా, "ప్రస్తుత కాలంలో ఉండటం చాలా ముఖ్యం. రాబోయే పర్యటనలో కోహ్లీ, రోహిత్ బాగా రాణించాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు.

# ఆఫ్ఘనిస్తాన్ చేతిలో బంగ్లాదేశ్ చిత్తు

ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ జట్టు బంగ్లాదేశ్‌పై జరిగిన 3 వన్డేల సిరీస్‌లో సంచలన ప్రదర్శన చేసింది. అబుదాబిలో అక్టోబర్ 14న జరిగిన చివరి మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిచి, సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇది ఆఫ్ఘనిస్తాన్‌కు వరుసగా 5వ వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. చివరి వన్డే మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏకంగా 200 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. అబుదాబిలో ఈ రికార్డు తేడాతో ఓడిపోవడం బంగ్లాదేశ్‌కు ఇదే మొదటిసారి. ఆఫ్ఘనిస్తాన్‌కు వరుసగా ఐదో వన్డే సిరీస్ విజయాన్ని అందించడంలో ఇబ్రహీం జద్రాన్ కీలక పాత్ర పోషించాడు. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో జద్రాన్ మొత్తం 213 పరుగులు సాధించాడు. ఈ పరుగులు 71 సగటుతో 14 ఫోర్లు, 3 సిక్సుల సహాయంతో చేశాడు. అయితే, ఈ సిరీస్‌లో జద్రాన్ రెండుసార్లు సెంచరీని కేవలం 5 పరుగుల తేడాతో కోల్పోయాడు. సిరీస్‌లో రెండో, మూడో వన్డేల్లో అతడు 95 పరుగుల ఇన్నింగ్స్ ఆడటం విశేషం. చివరి వన్డేలో, ఇబ్రహీం జద్రాన్ (95 పరుగులు), మహ్మద్ నబీ (62 పరుగులు) అద్భుతంగా ఆడటంతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. 294 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌లకు ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు కేవలం 27.1 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్ 200 పరుగుల భారీ తేడాతో మ్యాచ్‌ను గెలిచి, సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసింది. బంగ్లాదేశ్ పతనాన్ని శాసించిన బౌలర్‌లలో ప్రధానంగా బిలాల్ షామీ ముందున్నాడు. బిలాల్ షామీ 7.1 ఓవర్లలో కేవలం 33 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 5 వికెట్లు పడగొట్టాడు. బంగ్లాదేశ్‌పై వన్డేల్లో 5 వికెట్లు తీసిన మూడో ఆఫ్ఘనిస్తాన్ బౌలర్‌గా అతడు నిలిచాడు.



# సాయిదుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు



## బర్త్‌డే విషెస్‌గా ఫస్ట్ గ్లింప్స్ విడుదల

సాయిదుర్గా తేజ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎస్.వై.జి' (సంబరాల ఏటిగట్టు). ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్.కె.పి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి దుర్గాతేజ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అసుర సంధ్యవేళ మొదలైంది.. రాక్షసుల ఆగమనం..' అంటూ సాయి దుర్గాతేజ్ పవర్‌ఫుల్ డైలాగుతో ఆకట్టుకున్నారు. 'విరూపాక్ష' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత టాలీవుడ్ హీరో సాయిదుర్గతేజ్ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ఈ సినిమాకు రోహిత్ కె.పి దర్శకత్వం వహిస్తుండగా.. ప్రైమ్ షో ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.సాయి ధరమ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి అతడికి బర్త్‌డే విషెస్ తెలుపుతూ.. ఫస్ట్ గ్లింప్స్‌ను వదిలారు. సాయి తేజ్ ఇందులో బాలీ అనే పాత్రలో కనిపించబోతున్నాడు. 125కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మి కథానాయికగా నటిస్తుండగా. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# శర్వానంద్‌తో శ్రీను వైట్ల తదుపరి మూవీ





శ్రీను వైట్ల ఒకప్పుడు తెలుగులో క్రేజీయెస్ట్ డైరెక్టర్. యువ కథానాయకులతోనే కాదు స్టార్ హీరోలతోనూ సినిమాలు చేసి తన సత్తాను చాటుకున్నారు. శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన కొన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ సక్సెస్ ను అందుకున్నాయి. అయితే... 2011లో వచ్చిన 'దూకుడు' తర్వాత మళ్ళీ శ్రీను వైట్ల ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయారు. అంతేకాదు... 2018లో వచ్చిన 'అమర్ అక్బర్ ఆంథోని' సినిమా తర్వాత ఆయన ఏకంగా ఐదేళ్ళు దర్శకత్వానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. ఇక గత యేడాది 'విశ్వం' సినిమాతో మళ్ళీ లైమ్ లైట్ లోకి వచ్చిన శ్రీను వైట్ల... ఆ తర్వాత ఎట్టకేలకు ఓ ప్రాజెక్ట్ ను సెట్ చేయగలిగాడు. 'ఢీ' సినిమా తర్వాత దానికి సీక్వెల్ గా మంచు విష్ణుతోనే శ్రీను వైట్ల సినిమా చేస్తాడనే ప్రకటన వచ్చింది. కానీ అది పట్టాలెక్కలేదు. ఈ లోగా గోపీచంద్ హీరోగా 'విశ్వం' సినిమాను శ్రీను వైట్ల తెరకెక్కించాడు. ఇది థియేటర్లలో పెద్దంత ఆడకపోయినా... ఓటీటీలో బాగానే వీక్షకులను మెప్పించింది. అప్పటి నుండి మరో సినిమాను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడు. ఆ మధ్య నితిన్ హీరోగా శ్రీను వైట్ల ఓ సినిమా చేయబోతున్నాడనే ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు శర్వానంద్ తో శ్రీను వైట్ల ప్రాజెక్ట్ లాక్ అయ్యిందని తెలుస్తోంది. 'విశ్వం'కు రచన చేసిన నందు ఈ సినిమాకూ వర్క్ చేస్తున్నాడని అంటున్నారు. శ్రీను వైట్ల చెప్పిన కథ నచ్చడంతో శర్వానంద్ ఈ సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. దాంతో మిగిలిన నటీనటులు, టెక్నీషియన్స్ ను సెట్ చేసే పనిలో శ్రీను వైట్ల ఉన్నాడట. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అతి త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తుందని, వచ్చే యేడాది ప్రారంభంలో ఇది సెట్స్ పైకి వెళుతుందని అంటున్నారు. మరి శర్వా - శ్రీను వైట్ల తొలి కాంబినేషన్ లో రాబోతున్న ఈ సినిమాతో మరోసారి వీరిద్దరూ సక్సెస్ ట్రాక్ ఎక్కుతారేమో చూడాలి.

# ఛార్మీతో రిలేషన్ షిప్ వార్తలపై క్లారిటీ ఇచ్చిన పూరి జగన్నాథ్



"ఛార్మీ నాకు తన 13వ ఏట నుంచే తెలుసు. గత 20 సంవత్సరాలుగా మేమిద్దరం మంచి స్నేహితులుగా ఉన్నాం. కలిసి ఎన్నో సినిమాలకు పనిచేశాం. కానీ మా మధ్య ఎలాంటి రొమాంటిక్ వ్యవహారం లేదు" అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో యువత కారణంగానే ఇలాంటి పుకార్లు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.పుకార్లు రావడానికి గల కారణాన్ని విశ్లేషిస్తూ, "ప్రస్తుతం ఛార్మీకి ఇంకా పెళ్లి కాలేదు, తను సింగిల్‌గా ఉంది కాబట్టే ఈ రూమర్లు ఇంత బలంగా వస్తున్నాయి. ఒకవేళ ఆమె వయసు 50 ఏళ్లు ఉండి, వేరొకరితో పెళ్లి జరిగి ఉంటే ఈ విషయం గురించి ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఆమె ఒంటరిగా ఉండటమే ఇలాంటి వార్తలకు కారణమవుతోంది" అని పూరీ వివరించారు. తమ మధ్య ఉన్నది కేవలం స్నేహం మాత్రమేనని, అది ఎప్పటికీ శాశ్వతంగా ఉంటుందని ఆయన తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలతో పూరీ తనకూ, ఛార్మీకి మధ్య ఉన్న బంధంపై వస్తున్న ఊహాగానాలకు మరోసారి చెక్ పెట్టారు.


# చిరంజీవి సినిమాలో బంపర్ ఆఫర్ కొట్టేసిన కేరళ బ్యూటీ

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కలయికలో రాబోతున్న కొత్త సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ చిత్రాన్ని నవంబర్ 5వ తేదీన పూజ కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో చిరంజీవి సరసన నటించే హీరోయిన్‌గా యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ ను ఎంపిక చేశారని సమాచారం. ఇప్పటికే ప్రభాస్ సరసన నటిస్తున్న మాళవిక, గతంలో 'తంగలాన్'లో విక్రమ్, మలయాళంలో మోహన్‌లాల్ వంటి సీనియర్ స్టార్లతో కలిసి పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు మెగాస్టార్‌తో జతకట్టే అవకాశం దక్కించుకుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుండగా, 'మిరాయ్' చిత్ర దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని సినిమాటోగ్రాఫర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. చిరంజీవి పుట్టినరోజున అధికారికంగా ప్రకటించిన ఈ ప్రాజెక్ట్‌పై మెగా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.ప్రస్తుతం చిరంజీవి వరుస సినిమాలతో ఫుల్ జోష్ మీదున్నారు. ఇప్పటికే యంగ్ డైరెక్టర్ వసిష్ఠతో 'విశ్వంభర' చిత్రాన్ని పూర్తి చేయగా, మరోవైపు సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో చేస్తున్న సినిమా చివరి దశ చిత్రీకరణలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తికాకముందే బాబీతో మరో సినిమాను మొదలుపెడుతుండటం ఆయన స్పీడ్‌కు అద్దం పడుతోంది.



# నేపథ్య గాయని రావు బాలసరస్వతి కన్నుమూత

అలనాటి గాయని రావు బాలసరస్వతి దేవి (97) అనారోగ్యంతో హైదరాబాద్ మణికొండలోని స్వగృహంలో అక్టోబర్ 15వ తేదీ ఉదయం 8 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1928 ఆగస్ట్ 29న జన్మించిన రావు బాలసరస్వతి గొంతు ఆకాశవాణి సంగీత కార్యక్రమాలతో తెలుగు వారికి సుపరిచితం. సినిమాలలో తొలి నేపథ్య గాయనిగానూ ఆమె ఎంతో పేరు తెచ్చుకున్నారు. 'స్వప్నసుందరి, పిచ్చిపుల్లయ్య, పెళ్ళిసందడి, శాంతి, షావుకారు, దేవదాసు, లైలా మజ్ను, భాగ్యలక్ష్మి, మంచి మనసుకు మంచి రోజులు' తదితర చిత్రాల్లో ఘంటసాల, ఏ.ఎం.రాజా, సౌందర్‌రాజన్, పిఠాపురం నాగేశ్వరరావు, జిక్కి, ఏ.పి. కోమల లాంటి వారితో కలిసి ఆమె పాటలు పాడారు. రావు బాల సరస్వతి అసలు పేరు సరస్వతి. తల్లి తండ్రుల పేర్లు విశాలాక్షి, కావేటి పార్థసారధి. ఆమె తండ్రి గాయకులు, ప్రధానంగా వీణ, సితారు వాయించేవారు. చెన్నై లో కొంత కాలం ఉండి అనంతరం గుంటురుకి మారారు. ఆలకూరు సుబ్బయ్య వద్ద బాల సరస్వతి 1939లో కర్ణాటక సంగీతం మూడు సంవత్సరాలు అభ్యసించారు. ఆపైన బాల సరస్వతిని ఆమె తండ్రి ముంబై తీసుకెళ్ళి, హిందుస్తానీ సంగీత ప్రముఖులైన ఖేల్కర్, సినీ సంగీత దర్శకులు



వసంత్ దేశాయ్ వద్ద అభ్యాసం చేయించారు. అలానే మద్రాసులో పిచ్చుమణి అయ్యర్ దగ్గర ఆమె వీణ నేర్చుకున్నారు.సి. పుల్లయ్య దర్శకత్వం వహించిన 'సతీ అనసూయ'లో రావు బాలసరస్వతి గంగ వేషం వేశారు. ఆ యూనిట్ లో ఆమె చిన్నపిల్ల. దానికి ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. చిన్నప్పుడు పాటలు పాడటానికి వెళ్ళినప్పుడు ఆమెను బేబీ సరస్వతి అని పిలిచేవారు. ఆ తర్వాత బాల సరస్వతి అనడం మొదలు పెట్టారు. అదే చివరకు ఆమె పేరు అయిపోయింది. బాల సరస్వతి సుమారు 12 సినిమాలలో బాల నటిగా కనిపించారు. 1943లో ప్లే బ్యాక్ కొత్తగా వచ్చింది. దానికి ముందు ఎవరి పాటలు వారే పాడుకునే వారు. ఆ సమయంలో భాగ్యలక్ష్మీ సినిమాకు మొట్టమొదటగా ప్లే బ్యాక్ పాడారు బాల సరస్వతి. పెద్దాయక ఆమె తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషా చిత్రాలలో పాటలు పాడారు. ముఖ్యంగా శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు, కృష్ణశాస్త్రి రాసిన పాటలను ఆమె ఎక్కువగా పాడారు. కోలంక జమీందారీకి చెందిన రాజారావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావు ఆమెను 1944లో వివాహమాడారు. జమీందారీ కట్టుబాట్ల వల్ల, నటిగా సినిమాల్లో పాల్గొనడం తగ్గించారు. రాను రాను సినీ నేపథ్య గాయనిగా ఎన్నో అవకాశాలు వచ్చినా వదులుకోవాల్సి వచ్చింది. అయితే ఆమె ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో ఎన్నో లలిత గీతాలు ఆలపించారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ మొదలైన దక్షిణ భారత భాషల్లో సైతం ఎన్నో పాటలు పాడారు. 1974లో విజయనిర్మల దర్శకత్వం వహించిన 'సంఘం చెక్కిన శిల్పాలు' చిత్రంలో ఆమె పాట పాడారు. అదే సమయంలో సి. నారాయణరెడ్డి రాసిన మీరా భజన్స్ నూ గానం చేశారు.